WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల
సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036, 9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 251 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | మంగళవారం 9 సెప్టెంబర్ 2025 | వెల : 2-00

## గతంలో ఇలాంటి పరిస్థితి కనిపించిందా?



- రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా రైతాంగాన్ని పట్టి పీడిస్తోంది
- మరోవైపు కూటమి నేతల కనుసన్నల్లోనే యూరియా పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెట్‌కు చేరుతోంది
- నల్లబజార్‌లో రూ.200 అధికంగా చెల్లిస్తే తప్ప యూరియా లభించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్

తాడేపల్లి, స్వర్ణసాగరం

రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం (9వ తేదీన) రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని చేపడుతోంది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఇచ్చిన పిలుపులో భాగంగా రాష్ట్రం లోని అన్ని ఆర్డీఓ కార్యాలయాల ముందు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతుసంఘాలు శాంతియుత ఆందోళనలు నిర్వహించనున్నాయి. అనంతరం అధికారులకు వినతిపత్రాలను సమర్పిస్తాయి. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా రైతాంగాన్ని పట్టి పీడిస్తోంది. బస్తా యూరియా కోసం గంటల తరబడి రైతులు ప్రైవేటు దుకాణాలు, ఆర్బీకేలు, పీఏసీఎస్‌ల ముందు - మిగతా 2లో

## ఓటు వృథా కానివ్వొద్దు

ఉప రాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్ వేళ జాగ్రత్త
టీడీపీ ఎంపీలకు మంత్రి లోకేశ్ సూచన 2



## ఉపరాష్ట్రపతి ఎన్నికకు రెడీ

- అన్ని ఏర్పాట్లు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఎన్డీఏ వర్సెస్ ఇండియా కూటమి
- సీపీ రాధాకృష్ణన్, జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిల మధ్య ముఖాముఖి పోటీ
- ఓటింగ్‌లో పాల్గొననున్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు
- ఉదయం 10 గంటలకు పోలింగ్ షురూ..
- 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు..తర్వాత వెలువడనున్న ఫలితం





న్యూఢిల్లీ/హైదరాబాద్, స్వర్ణసాగరం

దేశ తదుపరి ఉప రాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ చేసింది. ఆరోగ్య కారణాలరీత్యా జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఈ పదవికి మంగళవారం ఎన్నికలు జరగనున్నాయి. పార్లమెంటు భవనంలో పోలింగ్ ప్రక్రియ సాగనుండగా.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పక్షాల అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మధ్య ముఖాముఖి పోటీ జరగనుంది. అభ్యర్థులిద్దరూ తమకు మద్దతు కోరుతూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా ఆయా పార్టీలు సోమవారం వేర్వేరుగా మాక్ పోలింగ్‌ను నిర్వహించాయి. ఉప రాష్ట్రపతి - మిగతా 2లో



## గుర్తింపు కార్డుగా ఆధార్

- బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంశంలో ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం
- 9వ తేదీలోగా ఆదేశాలు అమలుచేయాలని సూచన
- అయితే ఆధార్ అనేది పౌరసత్వానికి రుజువు కాదని వ్యాఖ్య

2

## తితిదే ఈవోగా మళ్లీ అనిల్‌కుమార్ సింఘాల్



- రవాణా, రోడ్లు, భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబు
- ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్‌కుమార్
- 11 మంది సీనియర్ ఐఏఎస్‌ల బదిలీ

అమరావతి, స్వర్ణసాగరం

రాష్ట్ర ప్రభుత్వం 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను సోమవారం బదిలీ చేసింది. పోస్టింగ్ కోసం నిరీక్షణలో ఉన్న అనిల్‌కుమార్ సింఘాల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) కార్యనిర్వహణాధికారి (ఈవో)గా నియమించింది. ఆయన తితిదే ఈవోగా పనిచేయడం ఇది రెండోసారి. సింఘాల్ 2017 – 2020 మధ్య తితిదే ఈవోగా పనిచేశారు. ప్రస్తుత ఈవో జె.శ్యామలరావుపై కొన్ని విమర్శలు రావడంతో ప్రభుత్వం - మిగతా 3లో



## స్వదేశీ మేళాకు పట్టం కట్టండి

- ట్రంప్ సుంకాల వేళ ఎన్డీఏ ఎంపీలకు మోదీ ఉద్బోధ
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జాగ్రత్తగా ఓటేయాలని సూచన
- మేడిన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించండి
- జీఎస్టీ రేట్లు భారీగా తగ్గిన దృష్ట్యా తరుణంలో స్వదేశీ వస్తువుల గొప్పతనాన్ని జనాన్ని తెలిసేలా చేయండి.

2



## రాజకీయ యుద్ధాలకు కోర్టును వాడుకోవద్దు

- సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర శాఖ వేసిన పరువునష్టం కేసును డిస్మిస్ చేస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య
- రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగానే ఎదుర్కోవాలన్న సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం
- పిటిషన్‌ను కొట్టేసినా వాదించే ప్రయత్నం చేసిన బీజేపీ తరపు న్యాయవాది
- మండిపడ్డ సీజేఐ.. మళ్లీ ఇలాంటి పిటిషన్ వేస్తే రూ. 10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరిక

2

# సమృద్ధిగా యూరియా



- కొరత లేదని రైతులకు భరోసా ఇవ్వాలి.. అధికారులు, కలెక్టర్లతో సుదీర్ఘ సీఎం సమీక్ష
- అక్కడికక్కడే కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఫోన్.. అదనపు యూరియా కేటాయింపులకు వినతి
- కాకినాడ చేరుకున్న నౌకలోని 7 ర్యాకుల ఎరువులు ఇవ్వడానికి నడ్డా అంగీకారం
- దీంతో 50 వేల టన్నులు అదనంగా రాక.. బ్లాక్‌మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు
- కర్నూలు ఉల్లి క్వింటా 1,200 కన్నా తగ్గితే ఆ మేరకు ప్రభుత్వం చెల్లింపు: చంద్రబాబు

అమరావతి, స్వర్ణసాగరం

కొందరు రాజకీయ ముసుగులో క్రిమినల్స్ తరహాలో ఆలోచిస్తూ.. ఎరువుల లభ్యత ఉండదన్న అభద్రతాభావం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జరుగుతున్న యత్నాలకు అడ్డుకట్ట వేయాలి.ఎరువులు దొరకవనే ఆందోళనతో రైతులు, కౌలు రైతులు ఒకేసారి వాటిని కొనుగోలు చేయకుండా.. నిల్వ చేసి పెట్టుకోకుండా చూడాలి. అనవసరపు కొనుగోళ్లపైనా దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో యూరియా లభ్యత సమృద్ధిగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. దానిని సమర్థంగా, సక్రమంగా రైతులకు అందేలా చూడాలని ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి యూరియా సరఫరా, ఉల్లి కొనుగోలు, తురకపాలెంలో ఆరోగ్య పరిస్థితిపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 80,503 టన్నుల యూరియా అందుబాటులో ఉందని.. మరో 10 రోజుల్లో 23,592 టన్నులు రాష్ట్రానికి వస్తుందని అధికారులు ఆయనకు వివరించారు. వెంటనే సీఎం అక్కడికక్కడే కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రి జేపీ నడ్డాతో ఫోన్లో మాట్లాడారు. కాకినాడ తీరానికి చేరుకున్న నౌకలోని యూరియాలో 7 రేక్‌లను తమకు కేటాయించాలని కోరగా.. నడ్డా సానుకూలంగా స్పందించారు. దీంతో రాష్ట్రానికి అదనంగా 50 వేల టన్నులు కేటాయించినట్లయింది అని అధికారులు చెప్పారు. యూరియా పంపిణీలో ఎక్కడా సమస్య రాకుండా చూడాలని.. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి, ఎరువులపై రైతులకు భరోసా ఇవ్వాలని సీఎం ఆదేశించారు. 'నిత్యావసర వస్తువుగా - మిగతా 3లో

# అంతటా అపరిశుభ్రత, దుర్గంధం

హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ కస్తూర్బా బాలికల విద్యాలయాలను వరద కష్టాలు వెంటాడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కేజీబీవీ ప్రాంగణాలు బురదమయం కావడంతో పరిసరాలన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. వర్షాలకు గదుల గోడల్లోకి చెమ్మ చేరింది. కప్పుకునే దుప్పట్లే కాదు... వేసుకునే దుస్తులు కూడా తడిసిపోయి వాసన వస్తున్నాయి. అపరిశుభ్రత వల్ల దోమలు వ్యాపిస్తుండటం వల్ల విద్యార్థినులు దోమకాట్లతో అస్వస్థతకు గురవుతున్నారు. అధికారులు జోక్యం చేసుకున్నా ఇప్పటికిప్పుడు పరిస్థితి మెరుగవ్వడం కష్టంగా కనిపిస్తోంది.

**పరిశుభ్రత లోపించి అనారోగ్యం..**

రాష్ట్రంలో 495 కేజీబీవీ పాఠశాలలు ఉండగా 403 కేజీబీవీలను ఇంటర్ వరకూ ఉన్నతీకరించారు. కేజీబీవీల్లో 1,24,153 మంది విద్యార్థులు చదువుతున్నారు. టెన్త్ వరకూ దాదాపు లక్ష మంది విద్యార్థులు ఉన్నారు. సమగ్ర శిక్ష పర్యవేక్షణలో సాగే కేజీబీవీల్లోని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఇటీవల క్షేత్రస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. కరీంనగర్ ప్రాంతంలోని ఓ కేజీబీవీలో విద్యార్థులు దగ్గు, శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్నారు. సమీపంలోనే డంపింగ్ యార్డ్ ఉండటం, ఇటీవల వర్షాలకు ఇది దుర్గంధం వెదజల్లడం కారణమని గుర్తించారు. కొన్ని నెలలుగా మహబూబ్‌బాద్ జిల్లాల్లో 36 మంది, నిజామాబాద్ జిల్లాల్లో 90 మంది, వనపర్తిలో 50 మంది విషాహారంతో అస్వస్థతకు గురైన ఘటనలు నమోదయ్యాయి. పరిసరాల పరిశుభ్రత లోపించడం వల్లే ఈ ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తించారు. ఖమ్మం జిల్లా మారుమూల ప్రాంతంలోని కేజీబీవీల్లో వర్షపు నీరు చేరి ప్రాంగణమంతా బురదగా మారింది. భోజన సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు పెరిగాయి. వ్యాధుల బారిన పడుతున్నారు.

**అర్వపల్లిలో అరణ్య రోదన...**

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి కేజీబీవీ చినుకుపడితే జలమయమవుతోంది. ఇక్కడ 300 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం సమీపంలో చేపట్టిన కాల్వ నిర్మాణం వల్ల నీరు కేజీబీవీ వద్దే నిలిచిపోతోంది. కాస్త పెద్ద వర్షం పడితే విద్యాలయానికి సెలవు ప్రకటించాల్సిందే. వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్న మొర వినిపించుకొనే నాథుడే లేడని స్థానికులు అంటున్నారు.

**మంగపేట మూగ వేదన..**

ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని కేజీబీవీలో 170 మంది చదువుతున్నారు. ఇక్కడ కొత్త భవనమే ఉన్నా ప్రహరీ లేదు. పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. భోజన వేళల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. పందుల వల్ల దోమలు పెరుగుతున్నాయి. మురుగునీరు బయటకు వెళ్లలేక దుర్వాసన వస్తోంది. గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని కేజీబీవీ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగాయి.

**గండీడ్‌లో ఘోష**

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో కొత్తగా ఏర్పాటైన కేజీబీవీ అద్దె భవనంలో నడుస్తోంది. 188 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఇటీవల వర్షాలకు నీరు నిలిచి ప్రాంగణమంతా బురదమయమైంది. దీంతో దోమలు వ్యాపించి సుమారు 40 మంది విద్యార్థులు జ్వరాల బారిన పడి ఇళ్లకు వెళ్లిపోయారు. అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

**రాజన్నా... సమస్యలేంటన్నా!**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 కేజీబీవీలన్నీ పట్టణాలకు దూరంగా ఉన్నాయి. దీంతో రక్షణ కరువైందని విద్యార్థినులు అంటున్నారు. ఇల్లంతకుంట మండలంలోని కేజీబీవీకి వెళ్లే రోడ్డు సరిగ్గా లేక రాకపోకలకు వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం కురిస్తే ట్రాక్టర్‌పై వెళ్లాల్సి వస్తోంది. అనారోగ్య సమస్యలు వస్తే తక్షణ వైద్య సదుపాయానికి నరకయాతన పడాల్సి వస్తోంది. అధికారులు తక్షణమే స్పందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# గుర్తింపు కార్డుగా ఆధార్

న్యూఢిల్లీ

బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) అంశంలో ఆధార్ గుర్తింపు కోసం పోరాడుతున్న విపక్ష పార్టీలకు అనుకూలంగా సర్వోన్నత న్యాయస్థానంలో ఉత్తర్వులొచ్చాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తింపు కార్డ్‌గా ఆధార్‌నూ పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం సూచించింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ధృవీకరణ పత్రాల జాబితాలో 12వ గుర్తింపు డాక్యుమెంట్‌గా ఆధార్‌ను పరిగణించాలని ఈసీని న్యాయస్థానం ఆదేశించింది. "బిహార్ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ గుర్తింపు విషయంలో ఆధార్‌నూ అనుమతించండి. అయితే ఆ ఆధార్ అనేది పౌరసత్వ గుర్తింపునకు రుజువుగా భావించాలని మేం చెప్పట్లేదు. ఎస్ఐఆర్‌లో ఇకపై ఆధార్‌ను సైతం అంగీకరిస్తున్నట్లు స్పష్టంగా పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల అధికారులకు మీరు అవసరమైన ఆదేశాలను జారీచేయండి.
మా ఆదేశాలను సెప్టెంబర్ 9వ తేదీలోపు అమలుచేయండి"అని ధర్మాసనం ఈసీని ఆదేశించింది. "అక్రమ వలసదారుల పేర్లు ఓటర్ల జాబితాలో కలపాలని ఎవరూ కోరుకోరు. కేవలం నిజమైన భారతీయ పౌరులను మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించాలి. తప్పుడు డాక్యుమెంట్లను సమర్పించిన వారిని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించాలి"అని కోర్టు వ్యాఖ్యానించింది. ఓటర్ల ఆధార్ కార్డ్‌ను ఎందుకు ఆమోదించట్లేదో సంజాయిషీ ఇవ్వాలని గతంలో ఆదేశించిన నేపథ్యంలో ఈసీ ఇచ్చిన వివరణను కోర్టు సోమవారం ఆలకించింది.
ఈ సందర్భంగా ఈసీ తరపున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదించారు. "ముసాయిదా జాబితాలోని 7.24 కోట్ల మంది ఓటర్లలో 99.6 శాతం మంది తమ పేర్లు తుది ఓటర్ల జాబితాలో చేర్చాలంటూ సంబంధిత డాక్యుమెంట్లను ఇప్పటికే సమర్పించారు. ఇక 12వ ధృవీకరణ పత్రంగా ఆధార్‌ను అనుమతించాలంటూ పలువురు పిటిషన్లు ఇచ్చారు. అయితే ఇందులో ఆధార్‌ను ఒక రుజువుగా అంగీకరిస్తామని ఈసీ గతంలోనే పేర్కొంది. అయినాసరే ఆధార్‌ను కచ్చితంగా 12వ ధ్రువీకరణ పత్రంగా చేర్చాలని కోరడంలో అర్థంలేదు"అని ఆయన వాదించారు. దీంతో ధర్మాసనం జోక్యంచేసుకుంది. "ప్రజాప్రతినిధుల చట్టం%–%1950లోని 23(4) సెక్షన్, ఆధార్ చట్టం%–%2016లోని నియమ,నిబంధనల ప్రకారమే ఓటరు గుర్తింపు కోసం ఆధార్‌ను పరిగణించవచ్చని నిర్ధారించాం. అయితే ఆధార్ అనేది పౌరసత్వాన్ని రుజువుచేయబోదు"అని ధర్మాసనం స్పష్టంచేసింది.

**ఎస్ఐఆర్‌పై తగ్గుతున్న నమ్మకం!**

"ఎస్ఐఆర్ క్రతువుపై పిటిషన్‌దారులు, విపక్షాల్లో నమ్మకం తగ్గుతున్నట్లుగా తోస్తోంది. ఈ నమ్మకాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ రంగంలోకి దిగాలి. రాజకీయ పార్టీలు, ఓటర్లకు పారాలీగల్ వలంటీర్లు సాయపడాలి. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, మార్పులు చేర్పులపై చేసే దరఖాస్తుల విషయంలో వలంటీర్లు సాయం అందించాలి"అని కోర్టు ఆదేశించింది. తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 30వ తేదీన ముద్రించనున్నారు.

**ఈసీ సిగ్గుపడాలి: కాంగ్రెస్**

సుప్రీంకోర్టు ఎన్నిసార్లు ఆదేశించినా ఆధార్‌ను ధృవీకరణ జాబితాలో చేర్చకుండా నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తున్న ఈసీ సిగ్గుపడాలని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ సోమవారం తన సామాజికమాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఓటర్ల నమోదుకోసం ఆధార్‌నూ గుర్తింపు పత్రంగా పరిగణించాలని కోర్టు ఇప్పటికి మూడుసార్లు ఆదేశించింది. అయినా కోర్టు ఆదేశాలను ఈసీ పెడచెవినపెట్టింది. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఈసీ ఈ విషయంలో సిగ్గుపడాలి. విపక్ష రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లనూ ఈసీ గుర్తించట్లేదు. ఇవన్నీ ఈసీ సారథి సొంత నిర్ణయాల్లా కనిపిస్తున్నాయి. ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను, కేంద్ర ఎన్నికల సంఘాన్ని చరిత్ర క్షమించదు"అని ఆయన అన్నారు.

# స్వదేశీ మేళాకు పట్టం కట్టండి

న్యూఢిల్లీ



స్నేహితుడు, శత్రువు అనే బేధం లేకుండా అమెరికా ప్రభుత్వం అందరిపై సుంకాలతో బాదేస్తున్న వేళ ప్రధాని మోదీ స్వదేశీరాగం అందుకున్నారు. విదేశీ వస్తువులపై మోజు తగ్గించుకుని స్వదేశీ వస్తువులకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో సోమవారం ఎన్‌డీఏ కూటమి ఎంపీలతో సమావేశంలో పలు అంశాలపై ప్రధాని మాట్లాడారు. "దేశవాళీ ఉత్పత్తులకు ఆదరణ పెరిగేలా చూడండి. స్వదేశీ మేళాను ఉద్యమస్థాయికి తీసుకెళ్లండి. విదేశాల అధిక టారిఫ్‌ల వంటి ప్రతికూలతలు, సవాళ్ల సమయంలో భారత్ స్వావలంబన ద్వారా తన శక్తిసామర్థ్యాలను మరింతగా సంతరించుకోవాల్సిన తరుణమిది. మేడిన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించండి. జీఎస్టీ రేట్లు భారీగా తగ్గిన చక్కటి తరుణంలో స్వదేశీ వస్తువుల గొప్పతనాన్ని జనాన్ని తెలిసేలా చేయండి. ముఖ్యంగా నవరాత్రి, దీపావళి వంటి పండుగల సీజన్‌లో మీమీ నియోజకవర్గాల్లో ప్రజలతో, వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటుచేసి తగ్గిన జీఎస్టీ రేట్ల ప్రయోజనాలను వివరించండి"అని మోదీ అన్నారు. మోదీ ప్రసంగ వివరాలను తర్వాత కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు మీడియాకు వివరించారు. అమెరికా 50 శాతం టారిఫ్ భారం మోపిన వేళ మోదీ స్వదేశీ వస్తువుల ప్రాశస్త్యాన్ని ప్రస్తావించడం గమనార్హం.

**శక్తివంతమయ్యేవేళ సవాళ్లు సాధారణం**

"భారత్ శక్తివంతంగా ఎదిగే క్రమంలో సవాళ్లు ఎదురవడం సాధారణం. అయినాసరే అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించే క్రమంలో ఇలాటి సవాళ్లను ఎదుర్కొంటూ ఆత్మనిర్భర్‌ను సాధించాలి. సొంత నియోజకవర్గాల్లో దేశీయ ఉత్పత్తుల ప్రచారాన్ని మీరే నాయకులుగా ముందుండి నడపాలి. గతంలో భారత్‌లో జపాన్ తయారీ వస్తువుల వినియోగం అధికంగా ఉండేది. అలాంటి భారత్‌లో ఇప్పుడు దేశీయోత్పత్తులను అధికంగా ఉపయోగించగల్గుతున్నామని గర్వపడేలా మనం చేయాలి. మీరు పాల్గొనే ప్రతి కార్యక్రమంలో స్వదేశీ ఉత్పత్తులు కనిపించాలి. ఉపయోగించాలి"అని ఎంపీలకు మోదీ సూచించారు. "జీఎస్‌టీ శ్లాబుల తొలగింపు అనేది ప్రజల్లో పెను సంచలనంగా మారింది. ప్రజలతో 'స్వదేశీ మేళాలు', వ్యాపారులతో 'వ్యాపారీ సమ్మేళన్'లు నిర్వహించండి. గాల్లో తుపాను చెలరేగినాసరే మనం వాహన టైరులో మళ్లీ గాలి కొట్టాల్సిందే. అలాగే దేశీయంగా 'స్వదేశీ వాతావరణం'ఉన్నాసరే మన మళ్లీ విడిగా మన వంతు తోడ్పాటు అందించాల్సిందే"అని అన్నారు.

**ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జాగ్రత్త**

"ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసేటప్పుడు ఎంపీలు జాగ్రత్త వహించండి. తప్పులు దొర్లకుండా ఓటేయండి. పార్లమెంట్ సభ్యులే ఓటింగ్‌లో తప్పులు చేస్తే ప్రజలకు తప్పుడు సందేశం వెళ్తుంది. మన అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ దేశవ్యాప్తంగా అన్ని వర్గాల్లో ఉత్తమ అభ్యర్థిగా పేరుతెచ్చుకున్నారు. ఆయన ఉపరాష్ట్రపతిగా చక్కటి సేవలు అందిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. తన పాలనాదక్షతతో ఆయ ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తేగలరని నేనూ విశ్వసిస్తున్నా"అని అన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు ఆమోదం పొందం వెనుక అధికార కూటమి ఎంపీల కృషిదాగి ఉందని మోదీ ప్రశంసించారు.

**హిమాచల్, పంజాబ్‌కు నేడు మోదీ**

వరద విలయంలో చిక్కుకుని అల్లాడిపోతున్న హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో తాజా పరిస్థితిని సమీక్షించేందుకు ప్రధాని మోదీ మంగళవారం పర్యటించనున్నారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలకూ మోదీ వెళ్లి అక్కడి బాధిత కుటుంబాలను పరామర్శించనున్నారు. హిమాచల్‌లోని కంగ్రాకు మోదీ వెళ్లనున్నారు. అక్కడే ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు రెడీ..

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికకు సంబంధించిన ఓటింగ్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. పార్లమెంట్ హౌస్ వసుధలోని రూమ్ నంబర్ ఎఫ్%–%101లో పోలింగ్ జరగనుంది. 6 గంటలకు కౌంటింగ్ అనంతరం ఫలితం వెల్లడి కానుంది. ఎలక్టోరల్ కాలేజీలో సభ్యులుగా ఉన్న రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. రాజ్యసభకు ఎన్నికైన 233 మంది సభ్యులు (ప్రస్తుతం ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి), రాజ్యసభకు నామినేటెడ్ అయిన 12 మంది, లోక్‌సభ ఎంపీలు 543 మంది (ప్రస్తుతం ఒక స్థానం ఖాళీగా ఉంది) ఎలక్టోరల్ కాలేజీలో సభ్యులుగా ఉన్నారు.

**ఎన్డీఏకు సొంతంగా 422 మంది సభ్యుల బలం**

ఎలక్టోరల్ కాలేజీలోని బలాబలాల పరంగా చూస్తే ఎన్డీఏకు స్పష్టమైన మెజార్టీ ఉంది. ఎలక్టోరల్ కాలేజీలో ఖాళీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 781 మంది సభ్యులున్నారు. ప్రస్తుతం 542 మంది సభ్యులున్న లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి 293 మంది సభ్యుల బలం ఉంది. ఇక 239 మంది సభ్యులున్న రాజ్యసభలో పాలక కూటమికి 129 మంది సభ్యుల మద్దతు ఉంది. విజయానికి అవసరమైన ఓట్లు 391 కాగా, ఎన్డీఏకు సొంతంగానే 422 మంది సభ్యుల బలం ఉంది. ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం తమ 11 మంది సభ్యుల మద్దతు ఎన్డీఏ అభ్యర్థికి ప్రకటించడంతో ఆ సంఖ్య 433కి చేరనుంది. ఇక విపక్ష ఇండియా కూటమికి రెండుసభల్లో కలిపి 311 ఓట్లు ఉండగా, ఈ కూటమికి ఆప్ మద్దతు ప్రకటించింది. దీంతో కూటమి బలం 320 మాత్రమే దాటుతోంది. అయితే రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలో ఎంపీలు తమ పార్టీల విప్‌ను పాటించాల్సిన అవసరం లేదు.

**అన్ని పార్టీల మాక్ పోలింగ్..**

పార్టీల బలాబలాలపై ఇరు పక్షాలకు స్పష్టత ఉన్నప్పటికీ ఓట్లు చెల్లుబాటు కాకుండా పోవడంపై ఆందోళన, క్రాస్ ఓటింగ్ భయం రెండు కూటముల్లోనూ కనిపిస్తోంది. 2022 ఎన్నికల్లో 15 ఓట్లు చెల్లకుండా పోవడంతో ఈసారి పార్టీలు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ఇందులో భాగంగా బీజేపీ తమ ఎంపీల కోసం ఆది, సోమవారాల్లో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించగా, కాంగ్రెస్ పార్టీ పాత పార్లమెంట్ భవనం సెంట్రల్‌హాల్‌లో మాక్ పోలింగ్ ద్వారా తమ ఎంపీలకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విపక్ష ఎంపీలకు విందు ఇచ్చారు. సంవిధాన్ సదన్‌లో జరిగిన సమావేశంలో ఖర్గేతో పాటు సోనియాగాంధీ, శరద్‌పవార్, టీఆర్ బాలు, అఖిలేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సైతం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి నివాసంలో ఎంపీలతో మాక్ పోలింగ్ నిర్వహించింది.

**ఎన్డీఏ ఎంపీలతో మోదీ సమావేశం**

మంగళవారం ప్రధాని మోదీ ఎన్డీయే ఎంపీలనుద్దేశించి మాట్లాడారు. అనంతరం..'రాధాకృష్ణన్ అద్భుతమైన ఉప రాష్ట్రపతి అవుతారని ప్రజలు విశ్వసిస్తున్నారు..'అంటూ 'ఎక్స్'లో ఒక పోస్టు చేశారు. కోయంబత్తూరు నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన రాధాకృష్ణన్‌ను ఎన్డీఏ మచ్చలేని నేతగా అభివర్ణిస్తోంది. రాజకీయ, పాలనాపరమైన ఆయన విశేష అనుభవం..రాజ్యసభ చైర్మన్‌గా విధులు నిర్వర్తించేందుకు ఉపకరిస్తుందని పేర్కొంటోంది. ఇక విపక్షాల అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి 2011లో సుప్రీంకోర్టులో పదవీ విరమణ పొందారు. నల్లధనం, సల్వాజుడుం తదితర కేసుల్లో కీలక తీర్పులు వెలువరించారు.

**బీఆర్ఎస్, బీజేడీ దూరం**

రెండు కూటములకు సమాన దూరాన్ని పాటిస్తూ వస్తున్న బీఆర్ఎస్, బీజేడీలు ప్రస్తుత ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. ఈ ఎన్నికల్లో తటస్థంగా ఉంటామని ఇప్పటికే ప్రకటించాయి. ప్రస్తుతం రాజ్యసభలో బీఆర్ఎస్‌కు నలుగురు, బీజేడీకి ఏడుగురు సభ్యుల బలం ఉంది.

## ఓ ప్రత్యేక ప్రక్రియ




న్యూఢిల్లీ

కేవలం పార్లమెంటు సభ్యులు మాత్రమే పాల్గొనే ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రత్యేకమైనది. 'నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం'లో 'ఏక బదిలీ ఓటు' పద్ధతి ద్వారా ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగుతుంది. అంటే ప్రతి ఎంపీ బ్యాలెట్ పత్రంపై ఉన్న అభ్యర్థులకు తమ ప్రాధాన్యత క్రమాన్ని కేటాయించాల్సి ఉంటుంది. బ్యాలెట్ పత్రాలపై ఇద్దరు అభ్యర్థుల పేర్లు ఉంటాయి. ఎంపీలు తమకు ఇష్టమైన అభ్యర్థి పేరు పక్కన '1' అని రాయడం ద్వారా తమ మొదటి ప్రాధాన్యతను సూచించాలి. ఈ అంకెను భారతీయ సంఖ్యలలో, రోమన్ సంఖ్యలలో లేదా ఏదైనా భారతీయ భాషలోని సంఖ్యలలో రాయవచ్చు, కానీ అక్షర రూపంలో రాయకూడదు.

**సంక్లిష్టమైన లెక్కింపులు ఉండవు**

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో రాష్ట్రపతి ఎన్నికల్లా ఓటు విలువలో సంక్లిష్టమైన లెక్కింపులు ఉండవు. ఈ ఎన్నికల్లో పాల్గొనే ప్రతి ఎంపీ ఓటు విలువ 'ఒకటి' (1) గానే పరిగణిస్తారు. గెలవడానికి అభ్యర్థి మొత్తం చెల్లుబాటైన ఓట్లలో 50% కంటే ఎక్కువగా (కోటా) మొదటి ప్రాధాన్యత ఓట్లను సాధించాల్సి ఉంటుంది. ఒకవేళ మొదటి రౌండ్‌లో ఎవరికీ స్పష్టమైన మెజారిటీ రాకపోతే, తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని పోటీ నుంచి తొలగించి, వారి రెండవ ప్రాధాన్యత ఓట్లను మిగతా అభ్యర్థులకు బదిలీ చేస్తారు.

**పోటీ ఉంటేనే పోలింగ్**

భారత రాజ్యాంగం ప్రకారం, ఉప రాష్ట్రపతి పదవీకాలం ఐదేళ్లు. ప్రస్తుత ఉప రాష్ట్రపతి పదవీకాలం ముగిసేలోపు కొత్తవారిని ఎన్నుకోవడం రాజ్యాంగ బద్ధమైన విధి. ఒకవేళ అధికార, విపక్ష కూటముల మధ్య ఏకాభిప్రాయం కుదిరి, ఒక్కరే అభ్యర్థి బరిలో ఉంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. కానీ ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పుడు విజేతను నిర్ణయించడానికి పోలింగ్ తప్పనిసరి.

**రహస్య పద్ధతిలో ఎందుకు?**

ఉప రాష్ట్రపతి ఎన్నికను రహస్య బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించడానికి బలమైన రాజ్యాంగ పరమైన కారణాలు ఉన్నాయి. ఎంపీలు ఎలాంటి ఒత్తిడికి, ప్రలోభాలకు, పార్టీ విప్‌లకు లొంగకుండా తమ అంతరాత్మ ప్రబోధం మేరకు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. రాజకీయాలకు అతీతంగా సభ్యులు తమ ప్రతినిధిని ఎన్నుకోవాలన్నదే రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశం. ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ పత్రాన్ని పార్టీ ఏజెంట్లతో సహా ఎవరికీ చూపించడానికి వీల్లేదు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# ఓటు వృథా కానివ్వొద్దు

న్యూఢిల్లీ

ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను పూర్తి మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ ఎంపీలకు మంత్రి లోకేశ్ సూచించారు. పోలింగ్ బ్యాలెట్ పద్ధతిలో జరుగుతున్నందున ఓటింగ్ వేళ పూర్తి అప్రమత్తంగా ఉండాలని, పార్టీ ఎంపీలు వేసే ఓట్లు వృథా కారాదని అన్నారు. ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ గెలవడం ప్రజాస్వామ్యానికి అవశ్యమని, ఆయనకు ప్రజాస్వామ్య విలువలు, వ్యవస్థలపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో బీజేపీతోనే టీడీపీ కలిసి ఉంటుందని, 2029 ఎన్నికల తర్వాత కూడా కేంద్రంలోను, రాష్ట్రంలోను టీడీపీ సుదీర్ఘకాలంపాటు కలిసి పయనిస్తుందని స్పష్టం చేశారు. మంగళవారం ఉప రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశాలతో సోమవారం మంత్రి లోకేశ్ ఢిల్లీ వచ్చారు. టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో టీడీపీకి చెందిన 16 మంది లోక్‌సభ సభ్యులు, ఇద్దరు రాజ్యసభ సభ్యులతో దాదాపు 2 గంటలకు పైగా సమావేశమయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ ప్రక్రియ, ఎన్డీయే అభ్యర్థివిజయానికి టీడీపీ తరఫున తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీలతో చర్చించారు. సీపీ రాధాకృష్ణన్‌తో సీఎం చంద్రబాబుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, 2024 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ మధ్య పొత్తు కుదరడంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని చెప్పినట్లు సమాచారం. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు.



**టీడీపీ ఎంపీలతో ప్రహ్లాద్ జోషి భేటీ**

మధ్యాహ్నం టీడీపీ ఎంపీలతో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి భేటీ అయ్యారు. లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో జరిగిన ఈ భేటీలో ఉప రాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్ విధానం గురించి నిపుణుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం మీడియాతో జోషి మాట్లాడుతూ... తమకు ఉభయ సభలలో ఉన్న మెజారిటీ కంటే అదనంగా 20–25 శాతం ఓట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. తెలుగు వ్యక్తి అయిన ఇండీ కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడం అసందర్భమని అన్నారు.

# సమృద్ధిగా యూరియా

-మొదటిపేజీ తరువాయి

ఉన్న యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కొందరు కావాలని రాజకీయ దురుద్దేశాలతో చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాలి. ఇదే సమయంలో... అధిక మోతాదులో ఎరువుల వాడకంతో కలిగే నష్టాన్ని రైతులకు వివరించాలి. ఎరువుల వినియోగాన్ని తగ్గించిన రైతులకు ప్రోత్సాహకంగా సబ్సిడీని వారి ఖాతాల్లో జమ చేసే విధానంపై చర్యలు తీసుకోవాలి. వచ్చే రబీ సీజన్‌కు ఇప్పటికే యూరియా సరఫరా ప్రణాళికలు సిద్ధం చేయాలి' అని నిర్దేశించారు. యూరియా సరఫరాపై మరోమారు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజన్‌లో ముందుగానే సాగునీరు ఇవ్వడం వల్ల పంటల సాగు ఎక్కువ చేశారని, వాణిజ్య పంటలైన ఉల్లి, మామిడి, టమోటా, చీనీ ఉత్పత్తి ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అధికారులకు చెప్పారు.

**డ్రామా ఆడిన వారిపై చర్యలు..**

కర్నూలు మార్కెట్‌లో ఉల్లి కొనుగోళ్లు, రైతులకు మద్దతు ధరపైనా సీఎం సమీక్షించారు. ఉల్లి ధర క్వింటాకు రూ.1,200కు తగ్గకుండా చూడాలని మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. రైతులెవరైనా క్వింటా రూ.1,200 కన్నా తక్కువ ధరకు అమ్ముకుంటే.. ఆ మిగులు ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ఉల్లి పంట ఉత్పత్తి అంచనా మేరకు నిల్వ చేసేందుకు గోదాములు, కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలను కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ఉల్లిని రైతుబజార్లతో పాటు బహిరంగ మార్కెట్లకు తరలించాలని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో పురుగు మందుల డబ్బాతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సీఎం ఆరా తీశారు. పంటను కనీసం మార్కెట్‌కు తీసుకురాకుండా పురుగు మందు తాగినట్లు డ్రామా ఆడినవారిపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. అరకు కాఫీకి సోకిన కాయతొలుచు పురుగుపై సీఎం ఆరా తీశారు. ఇప్పటికి 80 ఎకరాల్లో తెగులు సోకితే 60 ఎకరాల్లో పంట తొలగించామని ఉద్యానశాఖ అధికారులు చెప్పారు. ఈ తెగులు ఇతర ప్రాంతాలకు సోకకుండా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు.

**'తురకపాలెం' వ్యాధి మూలం గుర్తించండి..**

గుంటూరు జిల్లా తురకపాలెంలో తలెత్తిన అనారోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని వైద్య ఆరోగ్యశాఖను సీఎం ఆదేశించారు. వ్యాధికి మూలం ఎక్కడుందో గుర్తించాలని, దీనినో కేస్ స్టడీగా తీసుకుని, ఇతర ప్రాంతాల్లోనూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా సహా విష జ్వరాలు సోకకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా ఐదు గంటల పాటు సీఎం వివిధ అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీఎస్ విజయానంద్, వ్యవసాయం, వైద్యారోగ్యం, ఐటీ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పౌర సేవలు మరింత మెరుగుపడాలి**

పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, పంచాయతీరాజ్.. ఇలా వేర్వేరు శాఖల్లో అందిస్తున్న సేవలపై ఇంకా సంతృప్త స్థాయి పెరగాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై ఇక నుంచి ప్రతి వారమూ సమీక్షిస్తానన్నారు. కొన్ని చోట్ల రాజకీయ కారణాలు కూడా ప్రజల సంతృప్త స్థాయిపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఆర్టీజీఎస్ నుంచి సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ప్రతి ప్రభుత్వ శాఖ పౌరసేవలను మెరుగుపరచుకోవాలి. ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలను డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించి, తగిన నిర్ణయం తీసుకుంటాం. అలాగే కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు ఏ మేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగేందుకు ఉపకరిస్తున్నాయన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు.

**యూరియా కోసం ఉదయగిరిలో బారులు**

నెల్లూరు జిల్లా ఉదయగిరిరైతు సేవా కేంద్రం–2లో సోమవారం యూరియా పంపిణీ సందర్భంగా రైతులు బారులు తీరారు. అధికారులు ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయలేదని, అందరికీ యూరియా దక్కలేదని పలువురు ఆరోపించారు. ఉదయగిరికి 400 బస్తాల యూరియా కేటాయించగా.. తొలుత ఒక్కో రైతుకు రెండు బస్తాలు, తర్వాత ఒక్కో బస్తా పంపిణీ చేశారు. క్యూలోని రైతులందరికీ యూరియా దక్కకపోవడంతో వాగ్వాదాలు జరిగాయి. ఉదయం 10 గంటలకు పంపిణీ ప్రారంభించగా, మధ్యాహ్నం 3 గంటలకే 400 బస్తాల యూరియా అయిపోయింది. బస్తా రూ.266.50లకు విక్రయించాల్సి ఉండగా.. అధికారులు రూ.280 వసూలు చేశారని రైతులు చెబుతున్నారు. కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ బస్తాలు కొనుగోలు చేసి, అనంతరం బస్తా రూ.500 చొప్పున విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# రాజకీయ యుద్ధాలకు కోర్టును వాడుకోవద్దు

న్యూఢిల్లీ

సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ తెలంగాణ శాఖ దాఖలు చేసిన పరువునష్టం పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె. వినోద్‌చంద్రన్, జస్టిస్ అతుల్ ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం బీజేపీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'రాజకీయ యుద్ధాలకు ఈ కోర్టును ఉపయోగించుకోవద్దని పదేపదే చెబుతున్నాం'అంటూ సీజేఐ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంలో జోక్యం చేసుకోదలచుకోలేదని తేల్చిచెప్పారు. రాజ కీయాల్లో ఉన్నప్పుడు విమర్శలు తట్టుకొనే శక్తి ఉండాలని పేర్కొంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగానే ఎదుర్కోవాలని హితవు పలికారు. అయినా రంజిత్ కుమార్ వాదనలు కొనసాగించేందుకు ప్రయత్నించడంతో సీజేఐ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'మేం ఇప్పటికే పిటిషన్‌ను కొట్టేశాం. ఇంకా వాదనలు దేనికి? మళ్లీ ఇలాంటి పిటిషన్‌తో కోర్టుకు వస్తే రూ. 10 లక్షల జరిమానా విధిస్తాం'అంటూ హెచ్చరించారు.



**ఇదీ నేపథ్యం..**

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గతేడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన సభలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలు తమ పార్టీకి రాజకీయంగా పరువునష్టం కలిగించాయంటూ బీజేపీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు హైదరాబాద్ ట్రయల్ కోర్టులో పరువునష్టం దావా వేశారు. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. కేసులో ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారించి ఐపీసీ సెక్షన్ 499, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125 కింద విచారణకు ఆదేశించింది. ట్రయల్ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రేవంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. 'రాజకీయ ప్రసంగాలు తరచుగా అతిశయోక్తులతో నిండి ఉంటాయి. వాటిని పరువునష్టంగా పరిగణించడం సరికాదు'అని వాదించారు. ఈ వాదనతో ఏకీభవించిన హైకోర్టు.. ట్రయల్ కోర్టు ఆదేశాలను రద్దు చేస్తూ రేవంత్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు.

## శాంసంగ్ మంచి గెలాక్సీ ట్యాబ్ ఎస్11 సిరీస్

విజయవాడ

భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, గెలాక్సీ ట్యాబ్ ఎస్11 అల్ట్రా, గెలాక్సీ ట్యాబ్ ఎస్11ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇది ఇప్పటివరకు అత్యంత తెలివైన, అధునాతన టాబ్లెట్ అనుభవాన్ని అందిస్తుంది. గెలాక్సీ ట్యాబ్ ఎస్11 సిరీస్, ప్రో–గ్రేడ్ హార్డ్‌వేర్‌నుపెద్ద స్క్రీన్ కోసం ఆప్టిమైజ్ చేసిన అనుభవాలతో కలపడం ద్వారా ప్రయాణంలో అప్రయత్నమైన ఉత్పాదకత కోసం నిర్మించబడింది. గెలాక్సీ ట్యాబ్ ఎస్11 అల్ట్రా ఇప్పటివరకు వచ్చిన గెలాక్సీ ట్యాబ్‌లలో అత్యంత సన్ననిది. పనితీరులో రాజీ పడకుండా, ఇది ఒక ప్రీమియం టాబ్లెట్ ఎలా ఉండగలదో చూపించడానికి సన్నని ఫార్మ్ ఫ్యాక్టర్‌ను మించిపోతుంది. గెలాక్సీ ట్యాబ్ ఎస్11 అల్ట్రా కేవలం 5.1 మిమీ మందం, 692 గ్రాముల బరువు మాత్రమే ఉంటుంది.

## గణేష్ ప్రెస్ రాధాకృష్ణ మృతి

చల్లపల్లి, మహానగర్



గ్రామ ప్రముఖుడు, స్థానిక గణేష్ ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు వక్కలగడ్డ రాధాకృష్ణ (62) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. రాధాకృష్ణ సుదీర్ఘ కాలం నుంచి గ్రామంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకునిగా ఈ ప్రాంత ప్రజలకు చిరపరిచితులు. రాధాకృష్ణ మృతి పట్ల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామ సచివాలయం–1 భవనం పక్కన గణేష్ ప్రెస్ వద్ద రాధాకృష్ణ భౌతికకాయాన్ని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నానీ), ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ప్రముఖులు కస్తూరి ప్రసాద్, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు మీర్ రిజ్వాన్, పలువురు నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

## తితిదే ఈవోగా మళ్లీ అనిల్‌కుమార్ సింఘాల్

-మొదటిపేజీ తరువాయి

ఆయన్ను బదిలీ చేసి, సాధారణ పరిపాలనశాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శిగా నియమించింది. వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును రవాణా, రోడ్లు భవనాల శాఖకు బదిలీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం లాజిస్టిక్ రంగానికి విశేష ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే ఉన్నవి, ప్రస్తుతం నిర్మిస్తున్నవి, కొత్తగా నిర్మించబోయే విమానాశ్రయాలు, ఓడరేవులు వంటివన్నీ ఒకే గొడుగు కిందకు తెచ్చి, పెద్ద ఎత్తున మౌలిక వసతులు అభివృద్ధి చేయబోతోంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మూడు పోర్టులతో పాటు 50 కి.మీ.లకు ఒక పోర్టు నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. రాజధాని అమరావతితో పాటు దగదర్తి, కుప్పం, ఒంగోలు, శ్రీకాకుళంలలో విమానాశ్రయాలు నిర్మించబోతోంది. ఈ ప్రాజెక్టుల్ని యుద్ధప్రాతిపదికన పరుగులు పెట్టించాలన్న ఉద్దేశంతో సీనియర్ అధికారి కృష్ణబాబును రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. పెట్టుబడులు, మౌలిక వసతుల (ఐఅండ్ఐ) శాఖను కూడా పూర్తి అదనపు బాధ్యతగా ఆయనకే అప్పగించింది. ప్రస్తుతం సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శిగా (రాజకీయ) పనిచేస్తూ, ఎక్సైజ్ శాఖ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యత నిర్వహిస్తున్న ముకేశ్‌కుమార్ మీనాను ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. ఆయనకు గనులశాఖ ముఖ్య కార్యదర్శి పోస్టునూ పూర్తి అదనపు బాధ్యతగా అప్పగించింది. గనులశాఖ కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను ఆయన విజ్ఞప్తి మేరకు ఢిల్లీలోని ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్‌గా నియమించింది.

## గతంలో ఇలాంటి పరిస్థితి కనిపించిందా?

-మొదటిపేజీ తరువాయి

వేచి ఉండాల్సిన దుస్థితి సర్వత్రా కనిపిస్తోంది. మరోవైపు కూటమి నేతల కనుసన్నల్లోనే యరియా పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెట్‌కు చేరుతోంది. నల్లబజార్‌లో రూ.200 అధికంగా చెల్లిస్తే తప్ప యూరియా లభించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని పురుగుమందులు కొనుగోలు చేస్తేనే ఎరువులు విక్రయిస్తామంటూ వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు కృత్రిమంగా సృష్టించిన యూరియా కొరతను అడ్డం పెట్టుకుని కూటమి పార్టీలకు చెందిన పెద్దలే యూరియాను నల్లబజార్‌కు తరలిస్తూ, కోట్లు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్క యూరియా ద్వారానే దాదాపు రూ.200 కోట్ల మేరకు అక్రమంగా రైతుల నుంచి కాజేసేందుకు కుట్ర జరుగుతోందని ఇప్పటికే వైఎస్సార్‌సీపీ తీవ్ర స్థాయిలో ఆరోపించింది. దీనికి రుజువుగా పలుచోట్ల యూరియా అక్రమంగా తరలిస్తుండటం, రైతులే దానిని పట్టుకుని పోలీసులకు అప్పగించినా కనీసం కారకులైన వారిపై ఎటువంటి చర్యలు లేవు. కృష్ణాజిల్లాలో పట్టుబడిన యూరియాను రాత్రికి రాత్రే పోలీస్ స్టేషన్‌లోనే మార్చేసిన ఘటనలు ఈ ప్రభుత్వ నిర్వాకాన్ని ఎత్తి చూపుతున్నాయి. ప్రభుత్వం స్పందించి రైతాంగ డిమాండ్‌లపై దిగి వచ్చేలా అన్నదాత పోరును రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్‌ని అరికట్టి ఎమ్మార్పీ ధరలకే రైతులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలి. ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించాలి. టమాట, ఉల్లి, చీనీ, బొప్పాయితో పాటు రైతులు పండించే అన్ని పంటలకు మద్దతు ధర చెల్లించాలి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మాదిరిగా ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి మార్కెట్‌లో పోటీ పెంచాలి. ప్రైవేటు వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ఒప్పించి రైతులకు అండగా నిలబడాలి. తదితర రైతాంగ డిమాండ్‌లపై బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతు పోరును ముందకు తీసుకువెళు తున్నారు. ఇప్పటికే దీనిపై రైతుల్లో విస్తృతమైన అవగాహన కల్పించేందుకు ఈనెల 6న తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే 7వ తేదీన అన్ని నియోజకర్గ కేంద్రాల్లోనూ, 8న అన్ని మండల కేంద్రాల్లోనూ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. యూరియా సమస్యతో రైతులు సతమతం అవుతుంటే సీఎం చంద్రబాబు స్పందించిన తీరు అత్యంత దారుణంగా ఉంది. ముఖ్యమంత్రి ఈ సమస్యపై స్పందించిన తీరు, బెదిరిస్తూ మాట్లాడటం, సమస్యే లేదని చెప్పడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతగా క్యూలైన్లు ఉన్నా కూడా రైతుల్ని బెదిరించేలా మాట్లాడటంపై రైతులు మండిపడుతున్నారు. అసలు రాష్ట్రంలో సమస్యే లేదని దబాయించి మాట్లాడుతున్న వైనంపై సమస్య లేదని, వైఎస్సార్ సీపీ సమస్య క్రియేట్ చేస్తోందన్నట్లు రైతు సమస్యలను కూడా రాజకీయం చేస్తున్న కూటమి సర్కార్‌పై రైతుల్లో తీవ్ర అసహనం కనిపిస్తోంది. మరోవైపు ఈ సీజన్‌లో కేవలం అరవై శాతం మాత్రమే పంటలు సాగవుతుంటే, ఇంతగా యూరియా కొరత ఎలా ఏర్పడిందనే దానిపై ప్రభుత్వంలోనే సరైన సమాధానం లేదు. సీజన్‌కు సంబంధించి ముందుగా పంటల సాగు, ఎరువుల అవసరంపై ఎందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోలేకపోయారు, ముందస్తుగా సమీక్షా సమావేశాలను నిర్వహించలేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.

**ప్రభుత్వంలో కలవరం!**

అన్నదాత పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆందోళనలకు సిద్ధం కావడంతో కూటమి సర్కార్‌లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే రైతుల విషయంలో ఇదొక విఫల ప్రభుత్వం, పాలన చేతగాని ప్రభుత్వంగా ప్రజల నుంచి ఈసడింపులు ఎదుర్కొంటోంది. కూటమి పాలనకు ముందు.. గత అయిదేళ్ళ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో రైతులు పోల్చి చూస్తున్నారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయడం, పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీనీ సకాలంలో అందించడం, సీజన్ ప్రారంభంలోనే అవసరమైన మేరకు ఆర్బీకేలు, పీఏసీఎస్‌ల ద్వారా ఎరువులను రైతు ముంగిట్లోనే అందుబాటులో ఉంచడం, రైతుభరోసా ద్వారా పెట్టుబడి సాయాన్ని అందించడం ద్వారా అప్పుల పాలు కాకుండా రైతులకు అండగా నిలవడం, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసిన అన్ని రకాల పంటలకు మార్కెట్‌లో ధరలు లేని సమయంలో ప్రభుత్వమే జోక్యం చేసుకుని కొనుగోలు చేయడం ఇలా అనేక అంశాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

## ట్రాక్టర్ ట్రక్ లో ఉన్నది చెత్త కాదు

# ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ మందులు





### దక్కిలి గవర్నమెంట్ హాస్పిటల్

స్వర్ణ సగరం ప్రతినిధి దక్కిలి

ప్రజలకు కూటమి ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మంచి వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో ఎక్కడ కూడా ప్రజలు వైద్యం తో ఇబ్బంది పడకూడదున్న మహా సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళుతుంటే ప్రజల వైద్యానికి ఇవ్వాల్సిన మందులు మాత్రం చెత్తకుప్పలలో చేరిపోవడం అత్యంత బాధాకరం విచారకరం. వివరాలు: తిరుపతి జిల్లా దక్కిలి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఆదివారం సాయంత్రం 6 గంటలకు Ap26AH1994 ట్రాక్టర్ ట్రక్కునిండా టాబ్లెట్స్, సూదులు, సెలైన్స్ తదితర మందులు సంబంధించి రహస్యంగా తరలించారు. అందుకు సంబంధించి స్వర్ణ సాగరం రిపోర్టర్ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ బిందు ప్రియాంకను వివరణ కోరగా సమాధానం దాటవేశారు. గత కొంతకాలం నుండి దక్కిలి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ప్రభుత్వ వైద్యుల విధులు పట్ల నిర్లక్ష్యంపై ప్రజలు నుండి అనేక ఆరోపణలు వస్తున్న జిల్లా అధికారులు ఎవరు కూడా స్పందించకపోవడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దక్కిలి ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు రోగులకు అరకొర వైద్యం అందిస్తూ రికార్డులలో ఓపి లిస్టులో ఎక్కువమంది వైద్యులు వస్తున్నట్లుగా ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చూపించడం వల్లనే ఇంత పెద్ద మొత్తంలో ఒక ట్రాక్టర్ ట్రక్కునిండా ప్రజలకు అందాల్సిన మందులు వేస్టేజ్ గా చెత్త కుప్పలోకి వెళ్తున్నాయంటే దక్కిలి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు ఏ స్థాయిలో వైద్యం అందుతుందో మండల ప్రజలు మాట్లాడుకుంటున్నారు. దక్కిలి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంపై అనేక ఆరోపణలుస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఎందుకు స్పందించడం లేదోనని ప్రజలు మదన పడుతున్నారు, దక్కిలి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు మంచి వైద్యం అందించే విధంగా వైద్యులపై చర్యలు తీసుకోవాలని, ట్రాక్టర్ ట్రక్కునిండా చెత్త కుప్పులోకి తరలిన మందుల రహస్యాలను నిగ్గ తేల్చాలంటున్నారు ప్రజలు

# వెంకటగిరి పంచాయతీ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి





వెంకటగిరి,స్వర్ణసాగరం సెప్టెంబరు 8:

దక్కిలి మండలం ఆల్తురుపాడు పీఏసీఎస్ చైర్మన్ కాసరం చైతన్య రెడ్డి పంచాయతీలో ఉన్న పలు సమస్యలను శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక సర్పంచ్, మాజీ సర్పం చ్, పంచాయతీ నాయకులు శివారెడ్డి తదితరులతో కలిసి ఆయన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణను మర్యాద పూర్వకంగా కలుసుకు న్నారు.ఈ సందర్భంగా చైర్మన్ చైతన్య రెడ్డి, ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానం చేసి, జ్ఞాపికగా షోపీస్‌ను అంద జేశారు. అనంతరం గ్రామంలో తలెత్తుతున్న నీటి సరఫరా, కాలువల సమస్యలు, రహదారి మరమ్మతులు వంటి ప్రజా నీకానికి సంబంధించిన అంశాలను వివరించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ యన కోరా రు.ఎమ్మెల్యే రామకృష్ణ గ్రామ ప్రజల ఆందోళనల ను శ్రద్ధగా విన్నారు. సమస్యలకు ప్రభుత్వ స్థాయిలో సాధ్యమైన పరిష్కారాలను తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పంచాయతీ నాయకులు, పార్టీ కార్య కర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైయస్సార్సీపి వెంకటగిరి నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన కౌన్సిలర్ ఎమ్మే .నారాయణ కు ఘన సన్మానం

వెంకటగిరి స్వర్ణసాగరం సెప్టెంబర్,8

మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల తో వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడిగా 4 వ.వార్డ్ కౌన్సిలర్ ఎమ్మే. నారాయణ ని నియమిస్తూ వైయస్సార్ కాం గ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసిందితనకు ఈ పదవి రావడానికి కారణమైన వెంకటగిరి నియోజకవర్గ ఇంచార్జ్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిగారికి మరియు వెంకటగిరి సంస్థానం రాజా గారైన వి బి సాయి కృష్ణ యాచేంద్రకి యువరాజు వి సర్వజ్ఞ కుమార యాచేంద్ర కి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియ జేశారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నామీద పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని.. చేనేత కార్మికుల సమస్యల మీద నిరంతరం పోరాడుతానని గతం లో తుఫాన్లు వచ్చి చేనేత మగ్గం గుంతల్లో నీళ్లు వచ్చి 3 నెలలు పనులు లేక పస్తులు ఉండే వారని.. అటువంటి తుఫాను సమయాల్లోనే ప్రభుత్వాలు నామమాత్రంగా చేనేతలకు ఆర్థిక సహాయం చేసేవి అని 2019 లో వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయినప్పటి నుండి వర్షాల తో సంబంధం లేకుండా రాష్ట్రంలో ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి పార్టీలతో సంబంధం లేకుండా నేతన్న నేస్తం పథకం ద్వారా సంవత్సరానికి 24 వేల రూపాయలు లెక్కన 5 సం..కి 1లక్షా 20 వేల రూపాయలు నేరుగా ఆర్థిక సహాయం అందించారని. .జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న 5 ఏండ్లు చేనేత లకు స్వర్ణయుగం అని ఆ విషయాన్ని చేనేత కార్మికులు మరువరని తెలియజేశారు.. వెంకటగిరి ప్రాంత చేనేత కార్మికుల కష్టాలను మరియు చేనేత కార్మికులకు ఇంకా మెరుగైన సేవలు అందించడం కోసం త్వరలో చేనేత కార్మికుల తోటి కలిసి ఒక కార్యాచరణను సిద్ధం చేస్తామని తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఎమ్మే నారాయణ తెలియ జేశారుఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చేతరాశి బాలయ్య కౌన్సిలర్లు ధనియాల రాధ..పూజారి లక్ష్మి..కందాటి కల్యాణి. .తంబా సుకన్య..సామా గోపాల కృష్ణ..తూపాటి చెంచయ్య చేనేత కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని నారాయణ కు ఘన సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు





# సైన్స్ తో విద్యార్థులలో విజ్ఞానం డాక్టర్ సాంబశివరావు

### చారిటబుల్ ట్రస్ఆధ్వర్యంలో సైన్స్ ప్రయోగాలు

బుచ్చిరెడ్డిపాలెం స్వర్ణసాగరం సెప్టెంబర్8

స్థానిక శ్రీ గోపాలకృష్ణయ్య స్కూల్లో సోమవారం గుంటూరు కు చెందిన డాక్టర్ చివుకుల సాంబశివరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సైన్స్ ప్రయోగాలు చేయించారు. ట్రస్ట్ సీఈఓ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రజ్ఞానం అవగాహన చేసుకోవాలని వారి మేధాశక్తిని పరీక్షించుకోవాలని తెలిపారు. సమాజానికి అవసరమైన శాస్త్ర విజ్ఞానం అందించడంలో విద్యార్థుల దే కీలక పాత్ర అని పేర్కొన్నారు. స్కూల్ కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్ తన సందేశంలో తమ పాఠశాలలో విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తూ ఎన్నో విశిష్ట బహుమతులు పొందినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరువిద్యార్థి అకాడమీ ఫౌండర్ అండ్ చైర్మన్ మాలే పాటి వెంకటరత్నం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు





తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

## ఏఎంసి చైర్మన్ పునుగోటి విశ్వనాధం (మురగ)ను పరామర్శించిన కురుగొండ్ల



వెంకటగిరి- స్వర్ణసాగరం సెప్టెంబర్, 8,

తిరుపతి జిల్లా వెంకటగిరి పోలేరమ్మ జాతరకు సంబందించి నిన్న ఘటోత్సవ కార్యక్రమం వద్ద క్రాకర్స్ పేల్చడంలో ఆకస్మికంగా జరిగిన ప్రమాదములో గాయపడి పట్టణంలోని త్రినేటి ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న ఏఎంసి చైర్మన్ పునుగోటి విశ్వనాధం (మురగ) ను శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పరమార్శించినారు.

## కంచి తొలగించి భూములకు దారి కల్పించండి



### తహసీల్దారుకు రైతుల విజ్ఞప్తి

కొడవలూరు స్వర్ణ సాగరం సెప్టెంబర్ 8

మండలంలోనియల్లాయపాలేం పంచాయతీ లో సర్వే 585లో 155సెంట్లు, సర్వే 583 లో 40 సెంట్లు వ్యవసాయ భూమి చల్లంచర్ల సంజీవయ్య,అదే కాకుండా సర్వే 583లో 3 ఎకరములు మావిల్ల శ్రీనివాసులు రెడ్డి,సర్వే 555 లో 6 ఎకరాలు మావిల్ల గోపాలరెడ్డి , మరికొంత మంది ముస్లింలు మొత్తం 25 ఎకరాలు సాగుచేసుకొని జీవిస్తున్నారు.ఈ భూములకు పై భాగములో వున్న దేగపూడి అనూష రెడ్డి, వారి తండ్రి దేగపూడి జనార్ధన రెడ్డి , సర్వే 583,585,555లో సాగుచేసుకుంటున్న భూములలోకి సాగుదారులను పోనివ్వకుండా కంచె, ఇనుప గేటు నిర్మించడ ము వలన గత 3 సంవత్సరాములుగా వారి భూములు బీడు గా మారి పోయినవి. కంచె, ఇనుప గేట్ తొలిగించి దారి ఏర్పాటుచేయించి సర్వే 583,585,555 లో భూములు కలిగిన రైతులు వారి భూములు సాగుచేసుకునేదానికి సహాయం చేయవలసినదిగా తహసిల్దార్ కు అర్జీ అందజేశారు. తహసిల్దారుకు అర్జీ ఇచ్చిన వారి లో జిల్లా అభివృద్ధి కోఆర్డినేషన్ మరియు పర్య వేక్షక కమిటీ మెంబెర్ పొట్లూరి శ్రీనివాసులు,, గిరిజన రైతు చల్లంచర్ల సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

## "అన్నదాత పోరు" జయప్రదం చేయాలి

### వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు

నెల్లూరు స్వర్ణ సాగరం సెప్టెంబర్ 8



మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణిగోవర్ధన రెడ్డి పిలుపుమేరకు 9 మంగళ వారంఉదయం 9 గంటలకు చేపట్టిన అన్నదాత పోరునిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు .రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ పరిష్కార మార్గం కొరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో రైతులు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు

# ఎరువుల బ్లాక్ మార్కెట్ పై "రైతన్నకు బాసటగా వైయస్సార్ సీపీ అన్నదాత పోరు" పోస్టర్ ఆవిష్కరణ



**పెళ్లకూరు స్వర్ణసాగరం సెప్టెంబర్ 8.**

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.యస్ జగన్ మోహన్ రెడ్డిపిలుపు మేరకు కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు ఈనెల 9న జరిగే ఎరువుల బ్లాక్ మార్కెట్ పై "రైతన్నకు బాసటగా వైయస్సార్ సీపీ అన్నదాత పోరు" పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బస్తా యూరియా కోసం మండుటెండలో అన్నదాతలు నరకయాతన అనుభవిస్తుంటే కూటమి ప్రభుత్వం తమకు ఏమి పట్టదు అన్నట్టుగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలతో ప్రభుత్వానికి సంబంధం లేదన్నట్లుగా, రైతుల పంటలకు అవసరమైన ఎరువులు యూరియా సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో సొసైటీల దగ్గర రైతు భరోసా కేంద్రాల వద్ద సచివాలయాల వద్ద రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్నారని వివరించారు. అలాగే యూరియా సరఫరా పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా మంగళవారం ఆర్డీవో కార్యాలయం ముందు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర లేదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే విధంగా ముక్తకంఠంతో ప్రజలందరూ రైతులకు మద్దతు తెలియజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, బిల్లా రమణయ్య ఈదర రమేష్, కాపులూరి కృష్ణ,నన్నం పోతురాజు,నోటి వెంకటేశ్వర రెడ్డి, నల్లమోతు చంద్రమౌళి,రావులకొల్లు బ్రహ్మానందం, చెరుకూరి బ్రహ్మయ్య, పెన్నా కృష్ణయ్య, పులి రమేష,బద్దిపూడి జయరావు, గేరా మనోహర్, పాశం కొండయ్య, తలపనేని గోపి, ఎడ్ల మాధవరెడ్డి, చీమల.వెంకట రాజా, కూరపాటి వెంకటరామిరెడ్డి, గోగినేని రామాంజనేయులు, శ్రీరామ చిన మాల కొండయ్య, కిన్నెర బ్రహ్మయ్య, కాపులూరి మధు, గాజుల కిషోర్, పటాన్ ఆయుబ్ ఖాన్,సయ్యద్ దస్తగిరి, నగళ్ళ నారయ్య, మల్లి బోయిన శివకృష్ణ, అప్పనబోయిన రాజేష్, దొడ్డమ్మరెడ్డి.మదనమోహన్ రెడ్డి, భోగిశెట్టి దత్తాత్రేయ, బుస్సారెడ్డి నర్సారెడ్డి, షేక్ అల్లాభక్షు, జిల్లెల్లమూడి కోటేశ్వరరావు, ఆళ్ల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డైట్ లెక్చరర్ శ్రీనివాసులు మోడల్ ప్రైమరీ పాఠశాల పరిశీలన



**కోట స్వర్ణసాగరం సెప్టెంబర్ 8**

కోట మండలం శ్యామసుందరపురం కాలనీలోని మోడల్ ప్రైమరీ స్కూల్ నందు సోమవారం డైట్ లెక్చరర్ కే.శ్రీనివాసులు, కోట మండలం ఎంఈఓ 2 దారా. మస్తానయ్యతో కలసి పర్యవేక్షించారు.ఈ పర్యవేక్షణలో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ పి.రమణయ్య వారికి పాఠశాల వివరములు ఇచ్చి సహకరించారు. ఈ సందర్భంగా డైట్ లెక్చరర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలు బావున్నాయి అని,అనుభవజ్ఞులు మంచి ఉపాధ్యాయులు రమణయ్య హెడ్మాస్టర్ గా వుండడం పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని, పాఠశాలలోని వసతులు వంట గది, విద్యార్థుల బాత్రూమ్స్ పరిశుభ్రంగా ఉన్నాయని సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది.విద్యార్థులు ఉన్నారు.

## 16 మందికి పోస్టల్ ఇన్సూరెన్స్ పత్రముల అందజేత



**కోట స్వర్ణసాగరం సెప్టెంబర్ 8**

వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలో శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన 16 మందికి కొడవలూరు రాధాకృష్ణారెడ్డి స్మృత్యర్థం వారి కుటుంబ సభ్యులు వాకాడు సాయి కృష్ణ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పుట్టం వెంకటేశ్వర్లు రెడ్డి అనూరాధ దంపతులచే 14 వేల రూపాయల విలువచేసే పోస్టల్ ఇన్సూరెన్స్ పత్రములను శ్రీ పట్టాభిరామాలయం ఆలయ ధర్మకర్త,వాకాడు సొసైటీ మాజీ చైర్మన్ కొడవలూరు దామోదరరెడ్డి,దాతల చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా కొడవలూరు దామోదరరెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు ఒక సంవత్సరం లోపు ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబానికి 15 లక్షల రూపాయలు భరోసానిచ్చే ఇటువంటి ఇన్సూరెన్స్ ను చేయించి వాటి పత్రాలను అందజేయడం చాలా సంతోషమని ఈ సందర్భంగా దాతలకు అభినందనలు తెలియజేశారు.షిరిడీ సాయి అక్షయ సేవా సమితి అధ్యక్షులు అల్లం రమణయ్య,విశ్రాంత ఉపాధ్యాయులు ఆవుల సుబ్బయ్యలు ఇటువంటి సత్కార్యాలతో జీవితాన్ని సాఫల్యం చేసుకుంటున్న దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు, నరేష్,హేమంత్ శర్మ,శేషాద్రిశర్మ,సాయిబాబు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటగిరి యువ డాక్టర్ కు బంగారు పతకం

**వెంకటగిరి,స్వర్ణసాగరం, సెప్టెంబర్ 8,**



తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన యం.జి.అంకయ్య, వేణమ్మ – ఉపాధ్యాయులు, ప్రథమ కుమారుడైన డాక్టర్ యం.గుణశేఖర్ డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, నిర్వహించిన బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ తుది పరీక్షల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించారు, అందుకొరకు బంగారు పతకాన్ని , కులపతి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదగా, ఈ నెల 9న విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించనున్న, 9వ ఆరోగ్య వర్సిటీ స్నాతకోత్సవాలు వేడుకల్లో అందుకోనున్నారు. వివరాలు వెల్లడిస్తూ తల్లితండ్రులు ఆనందాన్ని వ్యక్తపరిచారు, డాక్టర్ యం.గుణశేఖర్, బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సు తిరుపతి లోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాలలో చేశారు, ప్రస్తుతం శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయం, కాంచీపురం లో, ఎండీ కోర్సు చేస్తున్నారని వివరించారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు నారాయణరావుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



**కోట స్వర్ణసాగరం సెప్టెంబర్ 8**

హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గాన సభనందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా కోట మండలం నెల్లూరు పల్లి కొత్తపాలెంకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు నారాయణరావుకి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార షీల్డ్ ను ఎస్ వి యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ పద్మశ్రీ డాక్టర్ కొలకలూరు ఇనాక్, ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ హైకోర్టు న్యాయమూర్తి శాంతి కుమారి,పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళి మనోహర్ రాజుల చేతులు మీదుగా అందజేసి శాలువా పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ నారాయణరావు ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది పేదలకు ఎన్నో రకాల సేవలు సహాయాలు చేసి వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేసే ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగేలా తీర్చిదిద్దారని,ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శంగా నిలిచి అనేకసార్లు అనేక అవార్డులను సొంతం చేసుకున్ననారాయణరావు సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు.

## యూరియా పై అవగాహన సదస్సు



**తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం సెప్టెంబర్ 8**

మండలం లోనిరావూరి కండ్రిగ మరియు వరిగొండ 1 గ్రామాలలో యూరియా వాడకం పై రైతులకు అవగాహన సదస్సు వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించారు అధిక యూరియా వాడకం అనర్థదాయకమని అధిక యూరియా వాడకం వలన చీడపీడలు ఎక్కువగా ఆకర్షింపబడతాయని కాండం నిటారుగా పెరిగి ఒరిగిపోతుందని తద్వారా తాలుగింజలు ఏర్పడతాయని రైతులకు దిగుబడి తగ్గుతుందని వివరించడం జరిగినది భూసార పరీక్షల ద్వారా ప్రతి రైతు పంటకు అవసరమైనంతవరకే రసాయన ఎరువులు వాడాలని వివరించారు పచ్చిరొట్ట ఎరువులు జీవన ఎరువులు సేంద్రియ ఎరువులు వాడకం వలన భూమిలో నత్రజని శాతం పెరిగి యూరియా వాడకం తగ్గుతుందని రైతులకు వివరించారు పిఎండిఎస్ కిట్లు రైతులకు ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉంచారు ఈ కిట్ లు వాడకం వలన యూరియా వినియోగం అవసరమైనంతవరకే ఉంటుందని వివరించారు గ్రామ రైతుల తో కలిసి మండల వ్యవసాయ అధికారి మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు ఏపీ సీ ఎన్ ఎఫ్ సిబ్బంది రైతులతో కలిసి యూరియా వాడకం పై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు

## నీటి కుంటలో పడి యువకుడు మృతి



**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.సెప్టెంబర్ 8**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం 65 వెంకటాపురం(కుప్పాలపల్లి) గ్రామానికి సమీపంలోని దొమ్మరోని గుడిసెలు సమీపంలో చిత్తూరు మంగసముద్రం హౌసింగ్ కాలనీ కి చెందిన అబ్దుల్ సమద్ కుమారుడు ముస్తఫా తన ద్విచక్రవాహనంతో పాటు నీటి కుంటలో పడి చనిపోవడం జరిగింది చనిపోయిన ముస్తఫా మృత దేహాన్ని బంగారుపాళ్యం ఎస్సై ప్రసాద్ ఏఎస్సై మల్లప్పలు పోస్టు మార్టమ్ నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వం ఆసుపత్రి కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బాల గురవం బాబు ఆధ్వర్యంలో ఘనంగా ఓబీసీ చైర్మన్ నియమకం

ఓ బి సి స్టేట్ ప్రెసిడెంట్ సొంటి నాగరాజు ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా OBC చేర్మెన్ గా ముక్కరంబాకమ్ బాలరాజు రెడ్డి నియామకం




**సత్యవేడు స్వర్ణ సాగరం సెప్టెంబర్ 08**

తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ తిరుపతి జిల్లా OBC చేర్మెన్ గా నియమించబడినారని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము ముక్కరంబాకమ్ బాలరాజు రెడ్డి నియామకం ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బాల గురవం బాబు మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ నాయకులు శ్రీమతి సోనియా గాంధీ, శ్రీ రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి % ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల బాధ్యులు పలకవర్మ, మరియు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైయస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు అమలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తడ మండలం డిసిసి వైస్ ప్రెసిడెంట్ లోకనాథం, తిరుపతి జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్ రజాక్, ఎస్ సీ సల్ ఆధ్యక్షులు తడ బాబు తడ మండలం అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, తడ మండలం టౌన్ ప్రెసిడెంట్ మహేంద్ర,యూత్ ప్రెసిడెంట్ కుమరేష్,తడ మండల వైస్ ప్రెసిడెంట్ కుమార్ రెడ్డి,తడ మండల జనరల్ సెక్రెటరీ ప్రకాష్ రెడ్డి, మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## కీరమంద లో ఘనంగా అంతర్జాతీయ అక్షరాశ్యతా దినోత్సవం



**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.సెప్టెంబర్ 8**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,కీరమంద లో అక్షరాశ్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి మాట్లాడుతూ దేశాభివృద్ధి ఆదేశంలోని ప్రజల అక్షరాశ్యత పై ఆధాపడి ఉంటుందని తెలిపారు.అందుకే మన ప్రభుత్వాలు 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు ఉచిత నిర్భంద విద్య నందిస్తున్నాయని తెలిపారు.సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని భారతి మాట్లాడుతూ యూనిస్కో సూచనల మేరకు ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాల్లో ప్రతి సెప్టెంబర్ –8వ తేదీ ఈ దినోత్స వాన్ని నిర్వహిస్తారని, దేశవిదేశాల అక్షరాశ్యత, గణాంకాలను అందించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు "అ "అక్షరం ఆకారం లో కూర్చొని అక్షరాశ్యత ప్రాధాన్యత తెలిపారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు షంషీర్ ఖాన్ పట్టాభి,భారతి, విజయలక్ష్మి, దేవేంద్ర, పవిత్ర,గౌతమి,పూర్ణ విద్యార్థులు పాల్గొన్నారు

# యాళి వాహనము పై భక్తులకు దర్శనమిచ్చిన ఘననాథుడు





**కాణిపాకం , సెప్టెంబర్ 8 స్వర్ణ సాగరం**

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక బ్రహ్మోత్సవాలు యాళ్లి వాహనంపై కాణిపాకం గ్రామ పురవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చిన గణనాథుడు. ఏ. నరసింహారెడ్డి అండ్ సన్స్ అగరంపల్లి, పి. సుబ్బారెడ్డి అండ్ సన్స్ చిన్నకాంపల్లి ,వారు ఉభయదారులగా వ్యవహారించారు. ఈ మేరకు వారు ఉదయం వరుస తీసుకురాగా అర్చక స్వాములు స్వామివారి మూలవిరాట్ కు పంచామృతం అభిషేకం నిర్వహించి చక్కగా అలంకరించి ధూప దీప నైవేద్యములను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి ఉభయ దారులు గా వ్యవహారించినవారు ఏ. నరసింహులు రెడ్డి అండ్ సన్స్ అగరంపల్లి, పి. సుబ్బారెడ్డి అండ్ సన్స్ చినకాంపల్లి, మరియు దేవస్థానం వారుస్వామి ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి యాళ్లి వాహనం పై స్వామి అమ్మవార్లను ఉంచి మంగళ వాయిద్యాలు వివిధ సాంస్కృతిక ప్రదర్శన నడుమ ఘనంగా గ్రామ మాడ వీధుల గుండా ఘనంగా ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్, డిప్యూటీ ఈవో సాగర్ బాబు, ఏ ఈ ఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండ పాణి , వాసు,టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిట్టిబాబు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ అర్చకులు, వీరితోపాటు ఉభయ దారులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ చైర్మన్ ను కలిసిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

## కాణిపాకం ఆలయ అభివృద్ధి ప్రతిపాదనలను టీటీడి చైర్మన్ కు సమర్పించిన ఎమ్మెల్యే

## ఆలయ అభివృద్ధి ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన టీటీడి చైర్మన్



**కాణిపాకం, సెప్టెంబర్ 8 స్వర్ణ సాగరం**

కాణిపాకం,తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి చైర్మన్ బి. ఆర్.నాయుడు ని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాణిపాకం ఆలయ పరిసర ప్రాంతంలో టీటీడీ ఆధ్వర్యంలో కళ్యాణమండపం, విశ్రాంతి భవనం నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి చైర్మన్ బీ.ఆర్. నాయుడు కి ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం ఈఓ పెంచల కిషోర్, కాణిపాకం మాజీ చైర్మన్ మణి నాయుడు, సమర్పించారు. ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన టీటీడీ చైర్మన్, కాణిపాకం క్షేత్రాభివృద్ధికి టీటీడీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఈ కట్టడాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, కాణిపాకం దేవస్థానం మాజీ చైర్మన్ మణి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ వెంకటయ్య కు నివాళు ఆర్పించిన జనసేన థామస్



**స్వర్ణ సాగరం కె వి బి పురం:**

సూరిపాక వెంకటయ్య బిజెపిరాష్ట్ర కౌన్సిల్ నెంబర్, సత్య వేడు అసెంబ్లీ 2019లో బీజేపీ యమ్ యల్ ఏఅభ్యర్థి. అయన మరణ వార్త తెలిసిన కేవీబీపురం మండల ఉమ్మడి పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ కేవీబీపురం మండల ఆధ్యక్షుడు బి. రామంజుల నాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు విభాగ అధ్యక్షుడు కనపర్తి గోపినాద్ రెడ్డి కేవీబీపురం జనసేన పార్టీ అధ్యక్షుడు వి. థామస్ బీజేపీ మండల ఆధ్యక్షుడు నాలి బాబు , తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి అవసరం సురేష్ రెడ్డి ఉమ్మడి పార్టీ కార్యకర్తలు పాల్గొని మృతు దేహానికి నివాళులి అర్పించారు.

# జిల్లా స్థాయి వాలీ బాల్ మరియూ క్రికెట్ పోటీ లలో జీవన జ్యోతి జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ.

**కోవూరు, స్వర్ణ సాగరం, సెప్టెంబర్ 8:**




నెల్లూరు లో జరిగిన YSPA 2025 ఆధ్వర్యం లో జరిగిన జిల్లా స్థాయి వాలీ బాల్ మరియూ క్రికెట్ పోటీలలో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు కాలేజీ తరుపున అభినందనలు తెలిపిన కాలేజీ ప్రిన్సిపాల్ మరియూ AO మరియు బోధన సిబ్బంది మరియూ విద్యార్థిని విద్యార్థులు.

# డోర్నకల్ మండలంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**స్వర్ణ సాగరం డోర్నకల్ సెప్టెంబర్ 08**

డోర్నకల్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మైనారిటి రెసిడెన్షియల్ పాటశాల ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పేషెంట్ ల యొక్క వివరాలను, సిబ్బంది వివరాలను, ల్యాబ్ ను, చుట్టూ పరిసరాలను తనిఖీ చేశారు.ఆసుపత్రి చుట్టుప్రక్కల పరిశుభ్రమమైన వాతావరణంతో వచ్చే రోగులకు వైద్యాన్ని అందరికి ఖచ్చితంగా అందేలా చూడాలన్నారు. సరిపడా మందులు ఆసుపత్రిలో ఎప్పటికి అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. లేకపోతే తెప్పించుకోవాలన్నారు.అనంతరం మైనారిటీ రెసిడెన్షియల్ పాటశాలను తనిఖీ చేసి. అక్కడి వంటశాల, స్టోర్ రూం, హాస్టల్ గదులు, తరగతి గదులను, స్టాఫ్ రూం లను పరిశీలించారు. విద్యార్థుల యొక్క తరగతి గదిలో విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేసి విద్యార్థులలోని సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. పాటశాల ఆవరణలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలన్నారు.ఇట్టి తనిఖీ లో డోర్నకల్ మునిసిపల్ కమిషనర్ నిరంజన్, వైద్యాదికారులు, తదితరులు ఉన్నారు.

# స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళం



ఆలయ అధికారులకు విరాళం అందజేస్తున్న దాతలు

**కాణిపాకం , సెప్టెంబర్ 8 స్వర్ణ సాగరం**

కాణిపాకం నిత్య అన్నదానానికి విరాళం, కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి నిత్య అన్నదానానికి విరాళం 1,00,000 రూపాయలు, దాత రామకృష్ణ వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్ వాస్తవ్యులు, ఆలయ అధికారు వీరికి దర్శన ఏర్పాట్లు చేసి అనంతరం ఆశీర్వాద మండలంలో వేద పండితులచే ఆశీర్వాదం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు ఉన్నారు.

# సన్ మేరీస్ లో మేరీస్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు



**స్వర్ణ సాగరం (నాయుడుపేట) సెప్టెంబర్ 08.**

తిరుపతి జిల్లా నాయుడుపేట లోని సన్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు మేరీస్ డే సెలబ్రేషన్ ప్రిన్సిపల్ సిస్టర్ ప్రియ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సన్ మేరీస్ హై స్కూల్ ని Play Class, LKG, UKG, పిల్లలకు ఫాన్సీ డ్రెస్, ఫ్రూట్, వెజిటేబుల్స్ ఫ్లవర్స్ డ్రస్సులతో పిల్లలకు కాంపిటేషన్ చేపట్టారు. కాంపిటీషన్లోని విద్యార్థులకు ఫస్ట్ సెకండ్ వచ్చిన విద్యార్థులకు గ్రేడింగ్ వేసుకుని బహుమతులు ఇస్తామని ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రియ తెలియజేశారు.ఈ కాంపిటేషన్లో చాలా చక్కగా నిర్వహించిన ఉపాధ్యాయులను ను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రియ, ఉపాధ్యాయులు, పేరెంట్స్ పాల్గొన్నారు

# రైతు భరోసా కేంద్రాలద్వారా యూరియా పంపిణి



**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.సెప్టెంబర్ 8**

బంగారుపాళ్యం మండల పరిధిలోని మహాసముద్రం రైతు భరోసా కేంద్రం నందు సోమవారం రైతులకు బంగారుపాళ్యం మండల వ్యవసాయ అధికారిని భారతి తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ పోలీస్ బందోబస్తు ద్వారా యూరియా పంపిణి చేశారు ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిని భారతి తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ కుర్మాయిపల్లి,నల్లంగాడు,తుంబకుప్పం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం నుండి రైతులకు యూరియా పంపిణి చేస్తామని వారి వారి రైతు భరోసా కేంద్రాలలో యూరియా తీసుకోవాలని రైతులకు అవసరమైన యూరియా పంపిణి చేస్తామని వారు తెలిపారు

# శ్రీకాళహస్తి మండలంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు






**స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్**

శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని మేళ్లచెరువు గ్రామ సచివాలయంలో సోమవారంనాడు ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు మండల అధికారులు, విద్యాశాఖ, గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, ప్రగతి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధార్ కార్డు లేని పాఠశాల విద్యార్థులను, గ్రామస్తులను గుర్తించి, పాఠశాల విద్యార్థులకు మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్ చేయడం, డోమిసైల్/బర్త్ సర్టిఫికెట్ ద్వారా ఆధార్ నమోదు చేయడం జరిగింది. కొందరికి ఆధార్ కార్డు నమోదు చేసే విధానం తెలియకపోవడంతో చాలా మంది ఆధార్ కార్డు నమోదు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి ఈ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయబడింది. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా కలెక్టర్ గారు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తి మండలంలో ఈ వారంలో ఎంపిక చేసిన గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు చేసుకొని ఉపయోగించుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సూచించారు. ఈ రోజు గ్రామ సచివాలయం వద్ద పలువురు పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు హాజరై ఆధార్ నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, పవిత్ర, బ్రాహ్మణపల్లి మహిళా పోలీసు హేమా వతి, వెల్ఫేర్ అసిస్టెంట్ రేవతి, గిరీష్, ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, రామచంద్రయ్య, గిరిజన సంక్షేమ శాఖ కోఆర్డినేటర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## తేజ, మౌనికల వివాహానికి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆశీస్సులు





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి మండలం, పోలి పంచాయతీ పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాంబశివయ్య మునెమ్మ దంపతుల కుమారుడు తేజ వివాహం ఈ నెల 4వ తేదీన శ్రీకాళహస్తి పట్టణంలోని సర్వారి దొరస్వామి నాయుడు సత్రంలో ఘనంగా జరిగింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బియ్యపు మధుసూదన్ రెడ్డి గారు ఆ సమయంలో స్థానికంగా లేకపోవడంతో, సోమవారం నాడు భీమవరం గ్రామానికి వెళ్లి నూతన వధూవరులైన తేజ, మౌనికలను ఆశీర్వదించి, బహుమతి ప్రదానం చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వైఎస్సార్సిపి మండల సీనియర్ నాయకులు గురవయ్య నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలిసి, తేనీటి విందును స్వీకరించారు. ముందుగా, మండలంలోని ఈశ్వరయ్య కాలనీ సమీపంలోని భీమవరం గ్రామ ప్రధాన రహదారి వద్దకు వైఎస్సార్సిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి, మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి గారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు శ్రీకాళహస్తి మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి వయ్యాల మనోహర్ రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గ వాలంటీర్ వింగ్ అధ్యక్షులు రంగినేని చెంచయ్య నాయుడు, ఇనగలూరు సర్పంచ్ చెలికం నాగరాజు రెడ్డి, శ్రీకాళహస్తి మండల వైఎస్సార్సీపీ యువజన విభాగం అధ్యక్షులు, రెడ్డిపల్లి సర్పంచ్ వెంపల్ల సురేంద్ర యాదవ్, ఉడమలపాడు సర్పంచ్ దాసరి మనోహర్, ఎంపేడు సర్పంచ్ కొండయ్య, సట్టు నరేష్ రెడ్డి, వైఎస్సార్సీపీ ఎస్సీ విభాగం నాయకులు పోలి గుణ, నక్క పెంచలయ్య, పోలి వెంకటరత్నం, చలపతి, సాంబయ్య, బాలరాజు, జగ్గరాజుపల్లి శివకుమార్, మామిడిగుంట శ్రీనివాసులు యాదవ్, భీమవరం శివారాయల్, వాంపల్లి ఈశ్వరయ్య నాయుడు, కోటీశ్వర్ నాయుడు, బాలి, రాజు, శేఖర్ యాదవ్, చింత జయప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ం

## కుప్పాల వెంకటేష్ (డుమ్ము రాయల్) జన్మదినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు తోట గణేష్ ఆధ్వర్యంలో బలిజసేన అధ్యక్షులు కుప్పాల వెంకటేష్ (డుమ్ము రాయల్) జన్మదినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి మండల పరిధిలోని తొండమనాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్పీకర్ మైక్ సెట్, స్టీల్ గ్లాసులు వితరణ చేయబడ్డాయి. పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. విద్యార్థులకు జ్యూస్, పండ్లు పంపిణీ చేయబడ్డాయి.ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ యాదవ్, అశోక్, బిఎస్ఎస్ నాయకులు రమణ, మురళి, దుర్గాప్రసాద్, వీర మహిళ యామిని కృష్ణ, జనసైనికులు పాల్గొన్నారు. శ్రీ కుప్పాల వెంకటేష్ (డుమ్ము రాయల్) జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం నిర్వహించబడింది. పాఠశాలకు అవసరమైన మైక్ సెట్, స్టీల్ గ్లాసులు అందజేయడం ద్వారా విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.తోట గణేష్ నాయకత్వంలో, ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ, వారిని శాలువాలతో సత్కరించడం జరిగింది. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. విద్యార్థులకు జ్యూస్, పండ్లు పంచిపెట్టి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఏర్పేడు మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ యాదవ్, అశోక్, బిఎస్ఎస్ నాయకులు రమణ, మురళి, దుర్గాప్రసాద్, వీర మహిళ యామిని కృష్ణ, జనసైనికులు ప్రముఖులు. కుప్పాల వెంకటేష్ (డుమ్ము రాయల్) జన్మదినోత్సవాన్ని సేవా కార్యక్రమంతో ఘనంగా నిర్వహించడం ప్రశంసనీయం. ఈ విధమైన కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తిని నింపుతాయి. విద్యారంగ అభివృద్ధికి తోడ్పడతాయి.

# ఘనంగా కంకణాల సత్యవర ప్రసాదరావు జన్మదిన వేడుకలు





## టిడిపి నాయకులతో కిక్కిరిసిన కంకణాల నివాసం

స్వర్ణ సాగరం ఓజిలి సెప్టెంబర్ 08:

మండల కేంద్రమైన ఓజిలి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇంచార్జ్ కంకణాల సత్య వరప్రసాదరావు 56 వ జన్మదిన వేడుకలను సోమవారం రాత్రి టిడిపి నాయకులు, కార్యకర్తలు,పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని నలుమూలల నుంచి వచ్చిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు కంకణాల సత్యవర ప్రసాద్ రావు ను శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరితో కలిసి 56 వ జన్మదిన కేకు ను అట్టహాసంగా కట్ చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రసాదరావు కు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ కోసం కంకణాల కుటుంబం చేసిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. దివంగత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కంకణాల రామ్మోహన్ రావు ఓజిలి గ్రామానికి విచ్చేసిన అప్పటి నుంచి పేద ప్రజల అభ్యున్నతికి వారి వంతు ఎంతో సహాయ సహకారాలు అందించారని తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు పాడి వెంకటసుబ్బయ్య కొనియాడారు. ఆపదలో ఉన్న ఎంతోమందికి మేమున్నా మంటూ అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత వారి కుటుంబానికి దక్కుతుందని తెలిపారు. తన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి కంకణాల సత్యవర ప్రసాదరావు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి తమ కుటుంబం ఎంతో కష్టపడి పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు, ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, కొందాం సహకార సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రాజు, తిరుపతి పార్లమెంటు బిసి సెల్ కార్యవర్గ సభ్యులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్,ప్రభాకర్ నాయుడు, ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఖలీల్ భాషా, కృష్ణ రెడ్డి, సురేష్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రాజు, మైలాం జయ చంద్రారెడ్డి, మల్లికార్జున్ రాజు, సూధకర్రెడ్డి, ఓజిలి వెంకటయ్య, రఫీ, ఖాదర్ బాషా, గోపాల్, వాకిరి సుబ్రహ్మణ్యం, కమలాకర్, వినోద్ కుమార్ నాయుడు, రాజేష్ నాయుడు, వెంకటేష్, కాటూరు కోటేశ్వరరావు , వినోద్ కుమార్ నాయుడు, కొం డూరు మల్లికార్జున రాజు, మాజీ సర్పంచ్ ముప్పాళ్ళ పరంధామరాజు, మురళి , మొద్దు చంద్ర, మల్లికార్జున్ యాదవ్, ముమ్మడి సుధాకర్ యాదవ్, ఖలీల్ భాషా, మైలాం మధు రెడ్డి, ఉసా వెంకటేష్ యాదవ్, గురునాథ్ పాల్గొన్నారు.

# నిత్య కృషివలుడు సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి మరోసారి అందలం.

**బిజెపి రాయలసీమ జోన్ ఇన్చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ.**

**పార్టీలో క్రమశిక్షణ గల నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న దయాకర్ రెడ్డి.**

**దయాకర్ రెడ్డికి జోనల్ ఇంచార్జ్ పదవి దక్కడంపై అభినందనలు వెల్లువ.**

**ఏబీవీపీ నాయకుడుగా మొదలై అంచులంచలుగా ఎదుగుతున్న దయాకర్ రెడ్డి.**

స్వర్ణ సాగరం (నాయుడుపేట) సెప్టెంబర్ 08.





విశాఖపట్నంలో రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన కొత్త జోనల్ ఇంచార్జిలను ప్రకటించడం జరిగింది. ఆ జాబితాలో నాయుడుపేటకు చెందిన సన్నా రెడ్డి దయాకర్ రెడ్డి కి రాయలసీమ జోన్ (చిత్తూరు, అన్నమయ్య, కడప,సత్య సాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల) : రాయలసీమ జోన్ ఇన్చార్జిగా ఉత్తర్వులు జారీ.తిరుపతి జిల్లా (పూర్వ నెల్లూరు జిల్లా) నాయుడుపేటకు చెందిన శ్రీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం నాయుడుపేట, సూళ్ళూరుపేటలలో, ఉన్నత విద్యాభ్యాసం ఏర్పేడు వ్యాసాశ్రమం మరియు చిత్తూరు తపోవనం హై స్కూల్ నందు, ఇంటర్, డిగ్రీ (బి. యస్సి. )లను నాయుడుపేట నందు పూర్తిచేశారు.ఇంటర్మీడియట్ చదివే రోజుల నుండి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకునిగా అనేక విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఎస్సీ, ఎస్టీ, బి.సి. హాస్టల్స్ నందు వసతులు మెరుగుపర్చటంకోసం, స్కాలర్షిప్లకోసం అనేక ఉద్యమాలు చేశారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలలో విద్యార్థులకు మెరుగైన వసతులకోసం కృషిచేశారు. అనంతరం రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) కార్యక్రమాలలో నాయుడుపేట ప్రాంతంలో చురుకుగా పాల్గొన్నారు.సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తూర్పు రాయలసీమ పట్టభద్రుల భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలపట్ల ఆకర్షితులై 2013వ సం౹౹లో భారతీయ జనతా పార్టీలో చేరి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్లో యువజనవిభాగమైన భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర విభజన తర్వాత రెండు పర్యాయాలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు నిరుద్యోగులకు చేసిన మోసానికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా యువమోర్చా చేసిన "బాబూ ఏది మా జాబు" కార్యక్రమాలలో రాష్ట్రంలోని అనేక జిల్లాలలో ఉద్యమాలు చేసి అరెస్ట్ కావడం జరిగినది. అప్పటి కేసులలో కొన్నింటికీ ఇప్పటికీ కోర్టులు చుట్టూ తిరుగుతుండడం గమనార్హం.2017 వ స ౹౹లో నెల్లూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ సభ్యు లుగా నామినేట్ కాబడి అభివృద్ధిలో భాగస్వాము లయ్యారు. అనంతరం భారతీయ జనతా పార్టీ తిరుపతి పార్లమెంట్ జిల్లా అధ్యక్షులుగా బాధ్య తలు నిర్వహిస్తున్న అదే సమయంలో పార్టీ ఆదే శాలతో తూర్పు రాయ లసీమ పట్టభద్రుల నియోజకవర్గ (ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిలా ్లలు) ఎన్నికలలో పట్టభద్రుల నియోజకవర్గం నుండి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న శ్రీ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి పోటీ చేశారు అనంతరం ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి రెండు సార్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు అనంతరం రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ గారు అధ్యక్షులుగా బాధ్యతలు వహించిన తర్వాత కార్యకర్తలను కలవాలని దృఢ సంకల్పంతో సారథ్యంలో ప్రారంభించారు దయాకర్ రెడ్డి ఇన్చార్జిగా వహించి ఆయన చేసిన సేవలను గుర్తించి నేడు పార్టీ రాయలసీమ జోన్ (చిత్తూరు, అన్నమయ్య, కడప,సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల) ఇన్చార్జిగా నూతన బాధ్యతను అప్పగించారు. అదేవిధంగా ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా నాయుడుపేట భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు దయాకర్ రెడ్డి అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## రైతులకు యూరియా అందించాలని సిపిఐ డిమాండ్






స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

యూరియా కొరతను తక్షణమే నివారించి, పంటలకు సరిపడా యూరియాను రైతులకు అందజేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు.శ్రీకాళహస్తి మండలం ఎండిఓ కార్యాలయం ఎదుట ఈరోజు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యదర్శి కామ్రేడ్ మురళి మాట్లాడుతూ, రైతులకు సరిపడా యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి యూరియాను తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సరిపడా యూరియాను వెంటనే అందించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిం చాలని కోరారు. లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి, రైతులకు అండగా నిలబడతామని హెచ్చరించారు. అనంతరం ఇంచార్జ్ ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి జనమాలు గురవయ్య, మండల కార్యదర్శులు మంచెల శివకుమార్, శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శులు గోపి, పట్టణ నాయకులు అయ్యప్ప, మురళి, జనార్ధన్, ప్రజానాట్య మండల, జిల్లా అధ్యక్షులు చారుశీల, రైతులు మనీ, రామ్మూర్తి, కృష్ణయ్య, గుర్రప్ప, సత్య, సాంబ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీలు బకాయిలను చెల్లించాలి



నాగలాపురం -స్వర్ణ సాగరం,సెప్టెంబర్ 08:

నాగలాపురం మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు గత 12 వారాలుగా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని నాగలాపురం మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఆర్.మురుగేషన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్.మురుగేషన్ మాట్లాడుతూ అధికారులు తక్షణమే స్పందించి12 వారాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.బకాయిలు విడుదల చేయలేని పక్షంలో వ్యవసాయ కూలీలతో ఎంపీడీవో కార్యాలయంనీ ముట్టడిస్తామని హెచ్చరించారు.గతంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 15 రోజులకు వేతనాలు ఇవ్వాలని అట్లు ఇవ్వని పక్షంలో చట్టం ప్రకారం అధికారులపై చర్యలు తీసుకునే అధికారం ఉండేదని,బకాయిలు చెల్లించే సమయంలో ఆలస్యమైతే అందుకు అపరాధ రుసుముతో కలిపి చెల్లించేవారని,నేడు 12 వారాలు, మూడు, నాలుగు నెలలు గడుస్తున్నా కూడా కూలీలకు బకాయిలు చెల్లించకపోవడం చాలా దారుణంఅన్నారు.అధికారులు చట్టాన్ని కూడా లెక్కచేయకుండా వారి ఇష్టానుసారంగా బకాయిలను పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు మాత్రం ప్రతినెలా క్రమం తప్పకుండా వారే ఖాతాల్లో జమ అవుతున్నాయని కూలీలకు మాత్రం మూడు, నాలుగు నెలలకు ఒకసారి కూడా వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కూటమీ ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని ఏ వారానికి ఆ వారం ఉపాధి హామీ బిల్లులు కూలీల ఖాతాలో జమ అయ్యేటట్లు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు దినమణి, సుబ్బమ్మ, బాలాజీ, మునస్వామి, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఈదులగుంట ఎల్.ఐ.సి. కాలనీ వరద ముప్పు - కాంగ్రెస్ పార్టీ వినతి

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

తొట్టంబేడు మండల పరిధిలోని ఈదులగుంట ఎల్.ఐ.సి. కాలనీ ప్రజలకు వరద ముప్పు పొంచి ఉందని, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఈదులగుంట కాలువను శుభ్రపరచాలని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జనరల్ సెక్రెటరీ షేక్ కరీముల్లా గారు తొట్టంబేడు తహశీల్దార్ భారతి గారికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈదులగుంట కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారం, అడ్డుగా పెరిగిన చెట్లు వంటి వాటిని తొలగించి, కాలువలో నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఈదులగుంట చెరువు నిండి, ఆ నీరు కాలువ ద్వారా ఎల్.ఐ.సి. కాలనీలోకి చేరుతుందని, దీనివల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. కాలువలో పూడిక, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి, కాలనీలోకి నీరు చేరే అవకాశం ఉందని, ఇది స్థానికులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కావున, వర్షాలు ప్రారంభం కాకముందే రెవెన్యూ అధికారులు స్పందించి, కాలువ శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టాలని, కాలువలోని చెట్లు, పొదలను తొలగించి, నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఇంకా, కాలువ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని కూడా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. చిరంజీవి, పాలూరి వెంకట ముని, నిజాముద్దీన్, ఈదులగుంట కరీముల్లా పఠాన్, షేక్ మహబూబ్ తదితరులు పాల్గొని, కరీముల్లా విజ్ఞప్తికి మద్దతు తెలిపారు. వారు కూడా తహశీల్దార్‌తో మాట్లాడి, కాలువ శుభ్రపరిచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, ప్రజలకు అండగా ఉంటుందని నాయకులు పునరుద్ఘాటించారు.

## ఆంధ్రనాడు విలేకరి శ్రీనివాసులు కి పితృవియోగం



బైరెడ్డిపల్లి స్వర్ణ సాగరం సెప్టెంబర్ 8 :-

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండల ఆంధ్రనాడు విలేకరి జి.శ్రీనివాసులు వారి తండ్రి జి.రఘుపతి ఆనారోగ్యంతో సోమవారం మృతి చెందడం జరిగింది.. మరణ వార్త తెలుసుకొన్న బైరెడ్డిపల్లి మండల తెదేపా అధ్యక్షులు బి ఎం రాధ కిషోర్ గౌడు,పలమనేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు భువనచంద్ర గౌడు,దేవదొడ్డి తెదేపా సీనియర్ నాయకులు రమేష్ అతని భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండయ్యకు నివాళులు,



స్వర్ణ సాగరం -తొట్టంబేడు,

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం కాసరం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొండయ్య ఆకస్మిక మృతి చెందారు. వారి పార్థివ దేహానికి సోమవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదన్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ౌ% పార్టీకి విశ్వాసపాత్రుడైన కొండయ్య మరణం తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, ఢిల్లీ బాబు, గంగాధరం, శ్రీరాములు రెడ్డి, ప్రభాకర్, వీర రాఘవులు, రఘునాథ్ రెడ్డి, పాపయ్య, శంకరయ్య, గురుమూర్తి తదితర నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

## కాలువలోని పూడిక, చెట్లను తొలగించి శుభ్రపరచాలి - తహసిల్దార్‌కు వినతిపత్రం,



శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలోని ఈదులగుంట ఎల్.ఐ.సి. కాలనీ గుండా ప్రవహిస్తున్న ఈదులగుంట కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాలు, పెరిగిన చెట్లను తొలగించి కాలువను శుభ్రపరచాలని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ కరీముల్లా సోమవారం తొట్టంబేడు తహసిల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ%ప్రతి వర్షాకాలంలో ఈదులగుంట చెరువు నిండిపోవడంతో కాలువ ద్వారా ఎల్.ఐ.సి. కాలనీపైగా భారీగా నీరు ప్రవహిస్తుందని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వర్షాకాలం రాకముందే కాలువను పూర్తిగా శుభ్రపరిచి చెత్తాచెదారాలను తొలగించాలని, తద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తహసిల్దార్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. చిరంజీవి మాట్లాడుతూ౯%కాలువ పలు చోట్ల ఆక్రమణలకు గురైందని, వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కాలువలో చెట్లు, చెత్తాచెదారాలు పేరుకుపోవడం వలన క్రిమికీటకాలు, దోమలు అధికంగా పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజారోగ్య సమస్యలు తలెత్తకముందే అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిజాముద్దీన్, ఈదులగుంట పఠాన్ కరీముల్లా, పాలూరి వెంకటముని, షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు కూడా అధిక సంఖ్యలో హాజరై కాలువ శుభ్రపరిచే పనులకు మద్దతు తెలిపారు.

# అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ



స్వర్ణ సాగరం -తొట్టంబేడు,

రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించనున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న జరిగే ఈ కార్యక్రమం కోసం జిల్లాలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.ఈ కార్యక్రమానికి ప్రచార భాగంగా, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచనలతో ఉమ్మడి జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, తొట్టంబేడు మండల వైసీపీ అధ్యక్షులు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం సోమవారం అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్క రించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నెముకలని, కానీ వారి జీవనోపాధిపై ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా ఎరువుల కోతలు రైతులపై మరింత భారం మోపుతున్నాయని, దీన్ని వైసీపీ అస్సలు సహించదని స్పష్టం చేశారు. అన్నదాత పోరు కార్యక్రమం ద్వారా రైతుల గొంతును బలంగా వినిపించి, ప్రభుత్వాన్ని కుదిపే దిశగా పోరాటం సాగిస్తామని తెలిపారు.పార్టీ నాయకులు రైతుల సమస్యలపై గళమెత్తి మాట్లాడి, కష్టకాలంలో రైతులకు అండగా నిలవడం తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం నడిపిన రోజులలో రైతులు సుఖశాంతులతో సాగు చేసిన రోజులను గుర్తుచేసి, మళ్లీ ఆ స్థితి రావడానికి పోరాడతామని వాసుదేవ నాయుడు స్పష్టం చేశారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో గంగాధరం, పెరుమాళ్ రెడ్డి, మునిరాజ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మురళీమోహన్ రెడ్డి, కొప్పల మురళి, ఆనంద్, కన్నలి సుబ్రహ్మణ్యం, వెంకటయ్య, మంగపతి, పూర్ణ, శివ, విజయ్ సుబ్రహ్మణ్యం, జి. ఢిల్లీ బాబు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు హాజరై కార్యక్రమానికి విశేష స్పందన చూపారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు కూడగడతారని, ఈ ఉద్యమం రైతుల భవిష్యత్తుకు మైలురాయిగా నిలుస్తుందని నాయకులు నమ్మకం వ్యక్తం చేశారు.రైతు సమస్యల పరిష్కారానికి అన్నదాత పోరు ఒక శక్తివంతమైన వేదికగా మారుతుందని, దీనికి రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి ఉత్సాహభరితమైన మద్దతు లభిస్తుందని వైసీపీ నాయకులు పేర్కొన్నారు.

## స్పందించారు ప్రమాదాన్ని నివారించారు





గుడిపాల స్వర్ణ సాగరం సెప్టెంబర్ 08 :

గుడిపాల మండలం రామభద్రాపురం నుంచి దాయంవారి పల్లెకు వెళ్లే మార్గంలో వాగు పక్కన విద్యుత్ స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా ఉన్నట్లు సోమవారం "ఈనాడు" చిత్తూరు మినీ పేజీలో వచ్చిన కథనంపై చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గారి కార్యాలయం సత్వరం స్పందించింది. విషయాన్ని గుడిపాల ట్రాన్స్ కో ఏఈ శివ దృష్టికి తీసుకెళ్లారు. వారు వేగంగా స్పందించి వాగు పక్కన ఓ వైపుగా వాలిపోయిన విద్యుత్ స్తంభాన్ని సరిచేసి నిటారుగా నిలబెట్టారు. ప్రమాదం జరగకుండా సరైన చర్యలు చేపట్టారు. విద్యుత్ స్తంభం కూలిపోకుండా సకాలంలో స్పందించిన ఎమ్మెల్యే వారి కార్యాలయం, ట్రాన్స్ కో వారికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

## కాళభైరవ స్వామి పూజలు



స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి సెప్టెంబర్ 8 :-

చంద్రగ్రహణ అనంతరం సోమవారం బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లె గ్రామం వద్ద వెలసిన శ్రీ కాలభైరేశ్వర స్వామి ఆలయము నందు అర్చకులు మురళీధరాచార్యులు ఆలయ శుద్ధి చేసి, పుణ్యాహవాచనం నిర్వహించి, కాలభైరేశ్వర స్వామికి పంచామృత అభిషేకములు జరిపి,సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రహణ దోష రాశి నక్షత్ర ఉన్నవారు దోష నివృత్తి చేసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమమునకు కృష్ణప్ప ,సంపంగి గౌడు భక్తులకు అన్నదానం నిర్వహించారు

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాల కీలకం



ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం -స్వర్ణ సాగరం, సెప్టెంబర్ 08:

నాగలాపురం మండలం స్థానిక వ్యాపారస్తుల కళ్యాణ మండపంలో గురుపూజోత్సవంను మండల విద్యాశాఖ అధికారులు బాబయ్య,జనార్ధన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గం శాసన సభ్యుడు కోనేటి.ఆదిమూలం పాల్గొని సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైనదని సత్యవేడు నియోజకవర్గం శాసన సభ్యుడు కోనేటి.ఆదిమూలం గుర్తు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి.ఆదిమూలం మాట్లాడుతూ ప్రధానంగా పౌరులను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అందువల్ల ఉపాధ్యాయులే మార్గదర్శక మారి విద్యార్థుల ఎదుగుదలకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నప్పుడు ఉపాధ్యాయులు చెప్పిన విద్యాబుద్ధులే ప్రతి ఒక్కరి జీవితాన్ని సక్రమంగా తీర్చిదిద్దేవీ అన్నారు. మొట్టమొదటిసారిగా 1962లో ఉపాధ్యాయుల దినోత్సవం జరుపుకున్నామన్నారు.భారతరత్న గ్రహీత,మొదటి ఉపరాష్ట్రపతి, ఉపాధ్యాయుడు డాక్టర్.సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మించిన 1888న సెప్టెంబర్ 5న టీచర్స్ డే ను జరుపుకుంటున్నటు ఎమ్మెల్యే వివరించారు.తదనంతరం ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులుకు పూలమాలవేసి,సాలువ కప్పి సన్మానిం చారు. ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదురై సుధా,సబ్ ఇన్స్పెక్టర్ సునీల్,పార్థిబన్,మాజీ ఎంపీపీ మురళి,మాతయ్య,మహేష్, పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ




స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి సెప్టెంబర్ 8 :-

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో ఆర్ బి కే నందు రైతులకు సబ్సిడీతో అందాల్సిన యూరియా పంపిణీ చేసిన వ్యవసాయ అధికారి గీతా కుమారి సీఐ పరశురాముడు. సచివాలయం సిబ్బంది సోమవారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఇదేవిధంగా నెల్లిపట్ల చప్పిడిపల్లి బైరెడ్డిపల్లి టు తీర్థం. గొల్లచిమనపల్లి. పిసిగుంట. లక్కనపల్లి. పంచాయతీలలో యూరియా అందించారు గత సంవత్సరంలో లాగే ప్రతి రైతుకు వీర్య అందేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు ఇప్పుడు వేసిన వరి పంటకు యూరియా తగిన మోతాదులో అంధక పంట నష్టం అయ్యే అవకాశం ఉంది కనుక రాష్ట్ర ప్రభుత్వం మరియు అధికారులు దృష్టిలో ఉంచుకొని రానున్న రోజుల్లో రైతుకు పండించే పంటకు యూరియా హెూస్పేట్ పంటకు కావలసిన ఎరువులు అధికారులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు



# రాజకీయాల్లోకి త్రిష.. విజయ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు!

నటి త్రిష.. తొలుత తమిళంలో జోడి అనే చిత్రంలో ఇలా వచ్చి అలా వెళ్లిపోయే పాత్రలో నటించారు. ఆ తర్వాత సూర్యకు జంటగా మౌనం పేసియదే చిత్రంతో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చారు. ఆ చిత్రం మంచి పేరు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత విక్రమ్ సరసన నటించిన సామి చిత్రం త్రిషను స్టార్ హీరోయిన్ చేసింది. అంతే ఆ తరువాత కెరీర్ పరంగా వెనక్కి తిరిగి చూసుకోవలసిన ఈ బ్యూటీకి కలగలేదు. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ అంటూ అన్ని భాషలలో నటిస్తూ అగ్ర కథానాయకిగా మారారు. ఈ 42 ఏళ్ల చెన్నై సుందరి ఇప్పటికీ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ కావడం గమనార్హం. అదేవిధంగా కథానాయకిగా 25 వసంతాలు పూర్తి చేసుకున్నారు. చాలామంది హీరోయిన్ల మాదిరిగానే త్రిష కెరీర్లోను చాలా ఎత్తు పల్లాలు చోటుచేసుకున్నాయి. అలా పడి లేస్తూ తన కెరీర్‌ను పదిల పరుచుకుంటూ వస్తున్న త్రిష ఇప్పుడు మళ్లీ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారనే చెప్పవచ్చు. ప్రస్తుతం ఈమె సూర్యకు జంటగా నటిస్తున్న కరుప్పు చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని దీపావళి సందర్భంగా తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. అదే విధంగా తెలుగులో చిరంజీవికి జంటగా నటిస్తున్న విశ్వంభర చిత్రం కూడా షూటింగ్ పూర్తి చేసుకొని వచ్చే ఏడాది సమ్మర్‌లో బరిలోకి దిగడానికి సిద్ధమవుతోంది. దీంతో ప్రస్తుతం ఈమె చేతిలో కొత్త చిత్రాలు ఏమీ లేవు. ఇదిలా ఉంటే త్రిష త్వరలో రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. నటుడు విజయ్ త్రిషకు మంచి మిత్రుడు. అయితే స్నేహబంధం కొందరు వేరే విధంగా కూడా ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేసి 2026లో జరగనున్న శాసన సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. కాగా ఇటీవల జరిగిన సైమా అవార్డుల వేడుకల్లో 25 ఏళ్ల సినీ కెరియర్ గాను నటి త్రిషకు స్పెషల్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తాను నటించిన ఒక్కో హీరో గురించి త్రిష మాట్లాడారు. నటుడు విజయ్ గురించి ఆమె మాట్లాడుతూ ఆయన నూతన పయనానికి గుడ్ లక్ అని పేర్కొన్నారు అదేవిధంగా విజయ్ కి ఎలాంటి కల ఉన్నా అది నెరవేరాలని, అందుకు ఆయన అర్హుడని, ఆయనకు తన శుభాకాంక్షలు అని అన్నారు. త్రిష చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.



# కోలీవుడ్‌లో బంపర్ ఆఫర్ అందుకున్న శ్రీదేవి

యంగ్ హీరోయిన్ శ్రీదేవి అప్పల 'కోర్టు' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఇందులో నటించిన శ్రీదేవికి ఫుల్ పాపులారిటీ వచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు తమిళ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. కేజీఆర్‌కు జోడీగా నటిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ కాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, శ్రీదేవికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఆసక్తిని పెంచుతోంది. ఈ భామ కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్ అందుకున్నట్లు పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. కోలీవుడ్ యంగ్ డైరెక్టర్ కెన్ కరుణాస్ హీరోగా నటిస్తున్న సినిమాలో శ్రీదేవి హీరోయిన్‌గా చేస్తున్నట్లు టాక్. స్కూల్ బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో అనిష్మా, ప్రియాంశి యాదవ్, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలో నటిస్తుండగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు 'కాదలన్' టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు టాక్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. శ్రీదేవి బంపర్ ఆఫర్ అందుకుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# నరకం అంటూనే టికెట్లు కొంటున్నారు



ఇటీవలే విడుదలైన బాలీవుడ్ మూవీ భాగీ 4కి యునానిమస్ గా నెగటివ్ టాక్, రివ్యూలు వచ్చేశాయి. మితిమీరిన హింస, తలాతోకా లేని కథా కథనాలతో థియేటర్లో కూర్చుకున్న ప్రేక్షకులతో నరకం స్పెల్లింగ్ రాయించిందనే కామెంట్ చాలా చిన్నదని చెప్పాలి. హీరో టైగర్ ష్రోఫ్ రెండున్నర గంటల పాటు దైవాంశ సంభూతుడిలా వేల కొద్ది బుల్లెట్లు, వందల కత్తిపోట్లు తగిలించుకునా నిటారుగా నిలబడి ఫైట్లు చేసిన వైనం మంచి ట్రోలింగ్ మెటీరియల్. సంజయ్ దత్ ఈ మూవీలో నరికిన చేతులు, తలలు లెక్కబెట్టాలంటే ఒక అయిదారుగురు లెక్కల టీచర్లకు డబ్బులిచ్చి మరీ కూర్చోబెట్టాలి. అయినా వాళ్ళు కరెక్ట్ గా చెప్పలేరు. ఇంత తేడా కంటెంట్ ఉన్న భాగీ 4 ఈ ఫ్రాంచైజ్ కి మాస్ లో ఉన్న ఫాలోయింగ్ వల్ల వీకెండ్ వరకు బాగానే వసూళ్లు రాబట్టింది. ట్రేడ్ లెక్కల ప్రకారం ఆదివారం రాకముందే ఇరవై నాలుగు కోట్లకు పైగా వసూలు చేయడం విచిత్రమే. అలాని జనాలు దీని గురించి పాజిటివ్ గా చెప్పడం లేదు. సోషల్ మీడియా వేదికగా తలంటుతూనే ఉన్నారు. దీంతో పాటే విడుదలైన ది బెంగాల్ ఫైల్స్ లో వివాదాస్పద అంశాలు, తెలుసుకోవాల్సిన సత్యాలు చాలా ఉన్నా ఆడియన్స్ దానికి దూరంగా ఉన్నారు. స్టార్లు లేకుండా మరీ మూడున్నర గంటల పాటు దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి చెప్పిన కథ డాక్యుమెంటరీ ఫీలింగ్ ఇచ్చింది. క్రిటిక్స్ ని ది బెంగాల్ ఫైల్స్ మెప్పించినప్పటికీ కమర్షియల్ గా మాత్రం డిజాస్టర్ వైపు వెళ్తోంది. దానికి భాగీ 4 కారణం కాదు కానీ నిడివి పెద్ద దెబ్బ కొట్టింది. అన్నట్టు భాగీ సిరీస్ లో ఇప్పటిదాకా వచ్చినవన్నీ రీమేకులే కావడం గమనార్హం. భాగీకి పునాది పడింది ప్రభాస్ వర్షంతో. భాగీ 2 కోసం అడవి శేష్ క్షణంని తీసుకున్నారు. భాగీ 3కి నాగచైతన్య తడాకా ఉపయోగపడింది. ఇప్పుడు భాగీ 4కి తమిళ మూవీ ఐయితు ఐయుతు ఐయుతుతో పాటు గోపీచంద్ ఒంటరి, బాలకృష్ణ లయన్ ని వాడుకున్నారు. అయినా ఉత్తరాది ప్రేక్షకులు మహా వెరైటీ. కొన్నిసార్లు తేడాగా ఉన్న డిజాస్టర్లకు కూడా కాసులు కురిపించేస్తారు.

## పెద్ద ఆఫర్ మిస్ చేసుకున్నా.. కొత్తలోక చాప్టర్ 1పై బాసిల్ జోసెఫ్



మలయాళ ఇండస్ట్రీలో ఉన్న టాప్ టాలెంటెడ్ యాక్టర్లలో జాబితాలో ఫస్ట్ ప్లేస్‌లో ఉంటాడు బాసిల్ జోసెఫ్. తాను అరుదైన అవకాశాన్ని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంతకీ ఏంటో అది అనుకుంటున్నారా..? ఇటీవలే తొలి మలయాళ ఫీ మేల్ సెంట్రిక్ సూపర్ హీరో ఫిల్మ్ లోక ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న విషయం తెలిసిందే. కళ్యాణి ప్రియదర్శన్ లీడ్ రోల్‌లో నటించిన ఈ మూవీ వరల్డ్ వైడ్‌గా రూ.200 కోట్ల క్లబ్‌లోకి ఎంటరయ్యే దిశగా దూసుకెళ్తోంది. అయితే ఈ సినిమాలో నటించే అవకాశం మిస్ చేసుకున్నానన్నాడు బాసిల్ జోషెప్. ఓ చిట్‌చాట్‌లో బాసిల్ జోసెఫ్ మాట్లాడుతూ.. డైరెక్టర్ డొమినిక్ అరుణ్ తనకు ముఖ్యమైన పాత్రను ఆఫర్ చేశాడని.. కథ కూడా వినిపించాడని చెప్పాడు. కానీ తాను వేరే కమిట్‌మెంట్స్ కారణంగా లోక సినిమాను ఒప్పుకోలేదన్నాడు. లోక చాప్టర్ 1లో తాను పెద్ద అవకాశాన్ని మిస్ చేసుకున్నానన్నాడు. అయితే డైరెక్టర్ డొమినిక్ అరుణ్ తనకు ఏ పాత్రను ఆఫర్ చేశాడనేది మాత్రం చెప్పలేదు బాసిల్ జోసెఫ్. టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్‌ను డైరెక్ట్ చేయబోతున్నట్టు వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు బాసిల్ జోసెఫ్.

## 46 ఏళ్ల తర్వాత బిగ్ స్క్రీన్‌పై సందడి చేయబోతున్న కమల్-రజనీకాంత్

సౌత్ ఇండస్ట్రీలో రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ అత్యంత ప్రభావవంతమైన దిగ్గజ నటులు . వీరిద్దరినీ సినిమా రంగానికి పరిచయం చేసిన వ్యక్తి దర్శకుడు కె. బాలచందర్. ఆయన దర్శకత్వంలో వీరిద్దరూ కలిసి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి మెప్పించారు. 1985 వరకు వీరు కలిసి 15కి పైగా సినిమాల్లో నటించగా, ఆ తర్వాత మాత్రం కలిసి నటించింది లేదు. వారి కాంబోలో సినిమా రాక దాదాపు 46 ఏళ్లు అయింది. ప్రస్తుతం కమల్ హాసన్ రాజకీయ రంగంలోనూ తన సత్తా చాటుతున్నారు. డిఎంకే పార్టీ మద్దతుతో రాజ్యసభ ఎంపీగా ఎంపికయ్యారు. సినిమాలు, రాజకీయాలు రెండింటినీ సమానంగా బ్యాలెన్స్ చేస్తున్న ఆయన ఈ వయస్సులోను చాలా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. 2020లో రజనీకాంత్, కమల్ కలిసి లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో సినిమా చేయాలనే ప్లాన్ చేయగా, అది కరోనా వలన ఆగింది. అయితే ఆ తర్వాత కమల్‌తో లోకేష్.. విక్రమ్ అనే సినిమా తీసి పెద్ద హిట్ కొట్టారు. ఇక ఇటీవల రజనీకాంత్‌తో కూలీ తీసాడు లోకేష్. 1979 లో వచ్చిన అల్లాయుద్దీన్ అద్భుత దీపం తర్వాత ఇద్దరు కలిసి నటించలేదు. 80 దశకం నుంచి స్టార్ డం అమాంతం పెరిగిపోయిన నేపథ్యంలో ఈ కాంబోని కలపడం ఎవరి వల్ల కాలేదు. లోకేష్ దర్శకత్వంలో వీరిద్దరు కలిసి భారీ మల్టీ స్టారర్ ప్రాజెక్ట్ చేస్తారని ప్రచారం జరగగా, దీనిపై క్లారిటీ లేదు. అయితే దుబాయ్ లో జరిగిన సైమా అవార్డుల వేడుకలో కమల్ హాసన్ స్వయంగా ఈ ప్రాజెక్టుని అనౌన్స్ చేయడం విశేషం

